ఈనాడు నల్గొండ

గురువారం 24 ఆగస్టు 2017 16 పేజీలు



ప్రాజెక్టుకు సహకారం.. రైతు కల సాకారం 11



పర్యావరణ హితంపై శ్రద్ధేదీ?

మట్టి గణపతులపై ప్రచారం కరవు

మట్టిని వదిలేసి.. మాటలు మార్చేసి

❒ చొరవ చూపని అధికార యంత్రాంగం ❒ నల్గొండ, యాదాద్రితో పోలిస్తే సూర్యాపేట భేష్

ఈనాడు, నల్గొండ

పర్యావరణంతో పాటు నీటి వనరులను కలుషితం చేసే రసాయన విగ్రహాలను కాకుండా.. వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హిత మట్టి గణపతులనే వాడాలని కొంతకాలం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం ఊపందుకుంటున్నా.. జిల్లా అధికార యంత్రాంగం ఆ దిశగా దృష్టి సారించడం లేదు. ఫలితంగా యథాప్రకారమే ఈ ఏడాదీ నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలో రసాయన విగ్రహాలే(ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) వాడవాడలా వెలుస్తున్నాయి. సామాజిక మాధ్యమాల పుణ్యమాని ప్రజల్లోనూ కొంత మార్పులు వస్తున్నా అధికార యంత్రాంగమూ చొరవ చూపితే పర్యావరణ హిత (మిగతా 7లో)

నీటి వనరులను కలుషితం చేయొద్దు

– ధర్మనాయక్, పర్యవేక్షక ఇంజినీరు (ఎస్ఈ), నీటిపారుదల శాఖ, ఉమ్మడి నల్గొండ జిల్లా

ప్రమాదకర రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితం అవుతున్నాయి. ఈ ఏడాది జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఉన్న నీటినే జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలు ఆలోచించి మట్టి వినాయకులనే ప్రతిష్ఠించుకోవాలి.

ముమ్మర ప్రచారం

నల్గొండ, యాదాద్రి జిల్లాలతో పోలిస్తే కొంతకాలం నుంచి సూర్యాపేట అధికార యంత్రాంగం మట్టి గణపతుల వాడకంపై ముమ్మరమైన ప్రచారం నిర్వహిస్తోంది. జిల్లాలోని ప్రతి మండలంలోని రెండు గ్రామ పంచాయతీలకు జిల్లా యంత్రాంగమే మట్టి గణపతులను సరఫరా చేసేలా కలెక్టరు సురేంద్రమోహన్ చర్యలు తీసుకుంటున్నారు. దీంతో యువజన సంఘాలు మట్టి గణపతుల వాడకంపై శ్రద్ధ చూపుతున్నారు.



ఐక్య పోరాటంతోనే కేసీఆర్ పాలనకు అంతం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నియంత పాలనను అంతమొందించాలని ప్రజా యుద్ధనౌక గద్దర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, టీ-మాస్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన టి-మాస్ ఆవిర్భావ సభలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అన్ని వర్గాలకు సమాన న్యాయం జరుగుతుందని భావించామని.. కానీ ఇప్పుడు జరుగుతోంది నియంత పాలన అని విమర్శించారు. -16లో



సర్వేనెంబరు 93లోని 16.21 ఎకరాల్లో సాగవుతున్న పత్తి పంట

తెరముందు యంత్రాంగం.. తెరవెనుక మంత్రాంగం

● అన్యాక్రాంతమవుతున్న 16.21 ఎకరాల భూమి

● నల్గొండ మండలం గుండ్లపల్లిలో ఆక్రమణ ● 'ఈనాడు' పరిశోధనలో వెల్లడి

ఈనాడు – నల్గొండ

దాదాపు రూ.ఐదు కోట్ల నుంచి రూ.ఆరు కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమి అది. నల్గొండ జిల్లా కేంద్రానికి కేవలం ఐదు కి.మీ. దూరంలో గుండ్లపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని 16.21 ఎకరాల భూమిని కొంత మంది 'పెద్దల' సహకారంతో కొన్నేళ్లుగా కొందరు పక్క గ్రామం రైతులు యథేచ్ఛగా ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా సదరు రెవెన్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

అసలు ఏం జరిగిందంటే...

నల్గొండ మండలం గుండ్లపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 93లో 16.21 ఎకరాల భూమి ఉంది. దీనిని 'పీర్లమాన్యం' పేరుతో ఆ గ్రామంలోని ఓ ముస్లిం కుటుంబానికి అప్పట్లో ఇనాంగా ఇచ్చారు. కాలక్రమేణా ఆ కుటుంబం వివిధ ప్రాంతాల్లో స్థిరపడటంతో కొంతకాలంగా ఆ భూమి పడావుగా ఉంది. రెవెన్యూ గెజిట్లో సరైన దస్త్రాలు లేకపోవడం, ఆ భూమికి సంబంధించిన వారు స్పందించకపోవడంతో దానిని కొంతకాలంగా ప్రభుత్వ భూమిగానే పరిగణిస్తున్నారు. రెండేళ్ల నుంచి ఈ భూమిపై కన్నేసిన కొందరు నేతలు తెర వెనక మంత్రాంగం నడిపి ఏటా కొంత భూమిని ఆక్రమించి వాటిలో పంటలను సాగు చేస్తున్నారు. గతేడాది పదెకరాల భూమిలో పంటలు సాగుచేయగా... ఇప్పుడు మొత్తం (మిగతా 7లో)

భూమిని స్వాధీనం చేసుకోవాలి

– శ్రవన్, గ్రామస్థుడు, గుండ్లపల్లి



రెవెన్యూ అధికారులు తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకోవాలి. గతంలోనూ మేం ఈ భూమి కబ్జాకు గురైందని స్థానిక అధికారులకు చెప్పాం. పూర్తిస్థాయి సర్వే జరిపి ప్రభుత్వ భూమిని కాపాడాలి.



తెగిపడ్డ విద్యుత్తు తీగలను తిరిగి అమర్చుతున్న ఉద్యోగులు

ముచ్చటగా మూడు.. సేవలందేను చూడు

❒ సత్వర సేవలకు గోదాముల విభజన అవసరం

❒ క్షేత్రస్థాయిలో విద్యుత్తు వినియోగదారులకు ఇక్కట్లు

❒ సర్కిళ్లపై రవాణా భారం

భువనగిరి టౌన్ – న్యూస్‌టుడే

విద్యుత్తు సంస్థ గోదాముల విభజనలో జాప్యం కారణంగా క్షేత్రస్థాయిలో వినియోగదారులకు సత్వర ఫలాలు అందడంలేదు. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి విడివడి కొత్త జిల్లాలుగా ఏర్పడినప్పటికీ అప్పట్లో విభజన జరగలేదు. కొత్త జిల్లాల్లో అన్ని విభాగాలను ఏర్పాటుచేసి పాలనాపరంగా ప్రజలకు, సంస్థ ఉద్యోగులకు వెసులుబాటు కల్పించినప్పటికీ (మిగతా 7లో)

నల్గొండ గోదాం పరిధి

జిల్లాలు: నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట

విద్యుత్ డివిజన్లు: ఐదు

సెక్షన్లు: 59

వరంగల్‌లో సెప్టెంబర్ 10న రజక వధూవరుల వివాహ పరిచయ వేదిక

రజక కమ్యూనిటీలో సంబంధాలను అన్వేషించే వారి సౌకర్యార్థం ఈనాడుపెళ్లిపందిరి.నెట్ వరంగల్‌లో సెప్టెంబర్ 10న పరిచయవేదిక నిర్వహిస్తుంది.

వేదిక: హోటల్ వైష్ణవి గ్రాండ్, ఫాతిమా కాంప్లెక్స్, ఫాతిమానగర్, ఖాజిపేట్, వరంగల్.

ప్రత్యేకతలివీ.. వధువు/వరుడు, వారి ఇష్టాఇష్టాల పరిచయం.

వధువు/వరుడు వివరాలతో కూడిన సి.డి. ఇవ్వబడును. ఈనాడుపెళ్లిపందిరి.నెట్ వెబ్‌సైట్ ద్వారా మీకు నచ్చిన 10 'కాంటాక్ట్ నంబర్స్' 30 రోజుల కాల వ్యవధిలో పూర్తి ఉచితంగా చూసుకునే అవకాశం. ఈనాడుపెళ్లిపందిరి.నెట్ ద్వారా వివాహం జరిగిన వారు 3 నెలల లోపు తెలియచేస్తే రూ॥ 2500/- విలువ గల గిఫ్ట్ కూపన్ అందచేయబడును.

పరిచయవేదికకు వచ్చిన వధువు/వరుడుతో కలిపి ముగ్గురు వ్యక్తులకు భోజన వసతి. రిజిస్ట్రేషన్ల సంఖ్య పరిమితం. రుసుము రూ॥ 2100/-. రిజిస్ట్రేషన్ కొరకు వచ్చునపుడు వధువు/వరుడుల ఐ.డి.ప్రూఫ్ (ఆధార్ కార్డ్/పాస్‌పోర్ట్/డ్రైవింగ్ లైసెన్స్/ఓటర్ కార్డ్) తీసుకురావాలి. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొనేవారికి 10% తగ్గింపు కలదు. 10% తగ్గింపు పొందుటకు ఆఖరు తేది : 31-08-2017.

మరిన్ని వివరాలకు సంప్రదించండి : ఈనాడు ఆఫీస్, ఇంటి నెం. 1-8-205, బాలసముద్రం స్విమ్మింగ్ పూల్ దగ్గర, హన్మకొండ, వరంగల్. ఫోన్స్ : 8008550132, కరీంనగర్ : 8008551132, నిజామాబాద్ : 8008551131, ఖమ్మం : 8008550131, మహబూబ్‌నగర్ : 8008551130, సూర్యాపేట్ : 9177147543, హైదరాబాద్ : 9100058123.

వరుడు లేదా వధువులకు సంబంధించిన కార్డ్ సైజ్ ఫోటో తప్పక వెంట తీసుకురావాలి. నిరంతరం ప్రత్యక్ష సేవలు మరియు సమాచారం కోరువారికి నిర్ణీత రుసుముతో ప్యాకేజిలు కూడా లభ్యమవుతాయి.

రిజిస్ట్రేషన్స్ ఆన్‌లైన్‌లో కూడా చేసుకోవచ్చు.
www.eenadupellipandiri.net

నీరు కదలదు.. ఆయకట్టు తడవదు



ఇప్పలగూడెం వద్ద ముళ్లచెట్లతో నిండిన పిల్లకాలువ

అధ్వానంగా ఏఎమ్మార్పీ కాలువలు

కేతేపల్లి, న్యూస్‌టుడే:

పద్దెనిమిది వేల ఎకరాల భూములకు సాగు నీరందించాల్సిన ఏఎమ్మార్పీ డీ-49 ప్రధాన కాలువ అధ్వానంగా తయారైంది. పన్నెండు గ్రామాలలోని బీడు భూములకు కృష్ణా జలాలను అందించాల్సిన ప్రధాన కాలువ నిండా కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి ఆనవాళ్లు కోల్పోయింది. ప్రధాన కాలువ పరిస్థితే ఇలా ఉంటే ఇక మైనర్లు, పిల్లకాలువల గురించి చెప్పే పరిస్థితి లేదు. రైతుల అవసరాల కోసం కృష్ణా జలాలను విడుదల చేస్తే నీరు అడుగు ముందుకు వెళ్లే అవకాశం లేదు. కనీసం ఆయకట్టు గ్రామాల్లోని చెరువులు, కుంటలకు కూడా నీరు చేరని దుస్థితి నెలకొంది. కాలువలు తవ్విన పదిహేనేళ్ల నుంచి ఇందులో కంపచెట్లు తొలగించిన దాఖలాలు లేవు. దీంతో ఏఎమ్మార్పీ కాలువలు రూపురేఖలు కోల్పోయాయి. కాలువల నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది లేకపోవడంతో దీని గురించి పట్టించుకునే వారు కరవయ్యారు. కాలువలు అధ్వానంగా ఉండటంతో నీరొచ్చిన సమయంలో ఎగువ ప్రాంతం వరకే పరిమితమవుతున్నాయి.

షట్టర్లు లేని తూములు

ఏఎమ్మార్పీ డీ-49 కాలువకు అనుబంధంగా ఉన్న మైనర్, సబ్‌మైనర్ కాలువల తూములకు షట్టర్లు లేవు. దీంతో నీరు వచ్చిన సమయంలో ఎగువ ప్రాంతాలలోని తూములకే వచ్చిన నీరంతా వెళ్తోంది. ఎగువ రైతులు దిగువకు నీరు వెళ్లకుండా రాళ్లు అడ్డం పెడుతున్నారు. దీంతో వచ్చిన నీరంతా పైతూముల ద్వారానే వెళ్తోంది. ఫలితంగా నీరు వచ్చిన సమయంలో బండెపాలెం, కొండకిందిగూడెం, చెరుకుపల్లి, ఎల్లమ్మగూడెం, మండలాపురం గ్రామాలకు నీరురావడం ఇబ్బందికరంగా తయారైంది. షట్టర్లు బిగించాలని అధికారులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనుమరుగవుతున్న పిల్ల కాలువలు

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు అనుబంధంగా నిర్మించిన పిల్ల కాలువలు కనుమరుగవుతున్నాయి. సంవత్సరాల తరబడి నీరు రాకపోవడంతో పరిసర రైతులు కాలువలను దున్నుకుంటున్నారు. కొన్నిచోట్ల భారీ వర్షాలకు కాలువ కట్టలమట్టి కారిపోయి అవి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. మండలంలోని ఇప్పలగూడెం, కొండకిందిగూడెం, బండెపాలెం, ఉప్పలపహాడ్ శివారు ప్రాంతాలలో దాదాపు ఎనిమిది మైనర్ కాలువలు ఇప్పటికే కనుమరుగైపోయాయి. పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్‌లో మైనర్, సబ్‌మైనర్ కాలువలు కనిపించే పరిస్థితి ఉండదు.



కొండకిందిగూడెం శివారులో షట్టరులేని డిస్ట్రిబ్యూటర్

లైనింగ్ చేస్తే ప్రయోజనం:



బొజ్జ చినవెంకులు, వ్యవసాయ సంఘం అధ్యక్షుడు

ఏఎమ్మార్పీ కాలువలకు లైనింగ్ నిర్మించాలి. లైనింగ్ చేయడంవల్ల కంపచెట్లు పెరగకపోవడంతోపాటు పూడిక చేరే పరిస్థితి ఉండదు. దీంతో నీరు వదిలిన సమయంలో చివరివరకు సాఫీగా వెళుతుంది. లైనింగ్ చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి అవసరమైన నిధులతో పనులు చేపట్టాలి.

రెండుసార్లు మాత్రమే నీళ్లు వచ్చాయి:



పెద్దినాగయ్య, రైతు, గుడివాడ

పదిహేనేళ్ల క్రితం కాలువలను తవ్వారు. ఇప్పటి వరకు కేవలం రెండుసార్లు మాత్రమే నీళ్లు వచ్చాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండిన ప్రతి సంవత్సరం నీరు విడుదల చేస్తున్నప్పటికీ అవి మొదటి ప్రాంతం వారికే పరిమితమవుతున్నాయి. దిగువకు రావడం లేదు. కాలువలనిండా ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు పెరగడంతో నీరు వచ్చే పరిస్థితి లేదు.

గుండెపోటుతో ఇంటర్ విద్యార్థి మృతి

గుర్రంపోడు, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం ఠానేదార్‌పల్లి గ్రామపంచాయితీ జిన్నాయిచింతలో ఇంటర్మీడియట్ విద్యార్థి వడ్లమాల శంకర్(18) బుధవారం తెల్లవారుఝామున గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన గుర్రంపోడులో ఇంటర్మీడియట్ సీఈసీ గ్రూపు మొదటిసంవత్సరం చదువుతున్నాడు. గతంలో రెండుసార్లు గుండె నొప్పిగా అనిపించిందని, మంగళవారం రాత్రి కూడా గుండె నొప్పిగా అనిపిస్తే కొద్దిసేపు ఉపచారాలు చేసిన అనంతరం తగ్గిందని కుటుంబ సభ్యులు చెప్పారు. తిరిగి తెల్లవారుఝామున మళ్లీ గుండె నొప్పిగా ఉండటంతో ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. కడు పేదకుటుంబం, వృద్ధులైన తల్లిదండ్రులు, వికలాంగులైన ఇద్దరు సోదరులు ఈయనకు ఉన్నారు. స్నేహితులే విరాళాలు పోగేసుకుని శంకర్ అంత్యక్రియలను నిర్వహించారు.



మృతిచెందిన వడ్లమాల శంకర్

నీటి గుంతలో పడి బాలుడు మృతి

(అడవిదేవులపల్లి) దామరచర్ల, న్యూస్‌టుడే:నీటి గుంతలో పడి అడవిదేవులపల్లి మండలం చిట్యాలకు చెందిన బాలుడు గువ్వల అఖిల్(3) మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గువ్వల కోటేశ్వరరావు భార్య మల్లీశ్వరి కలిసి చేను దగ్గరకు వెళ్తుండగా అఖిల్ వారి వెంట వచ్చేందుకు ప్రయత్నించగా నచ్చచెప్పి ఇంటివద్ద వదిలి వెళ్లారు. కొద్దిసేపటి తరువాత అఖిల్ సమీపంలో ఉన్న చేను వద్దకు నడిచి వెళ్లే క్రమంలో చిన్న కాలువను దాటే ప్రయత్నంలో నీటిగుంతలో పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. కోటేశ్వరరావుకు ఇద్దరు కుమారులు కాగా అఖిల్ రెండో వాడు. బాలుడి మృతితో కుటుంబసభ్యులు రోదనలు మిన్నంటాయి.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

లారీని ఢీకొన్న గరుడా బస్సు

16 మందికి గాయాలు



ప్రమాదంలో నుజ్జయిన బస్సు ముందు భాగం



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

డి.మల్కాపురం (చౌటుప్పల్‌గ్రామీణం), న్యూస్‌టుడే: హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడలోని ఆటోనగర్ బస్టాండు నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ గరుడా బస్సు (ఏపీ16 జెడ్0477) మంగళవారం రాత్రి పది గంటలకు బయలుదేరింది. బుధవారం తెల్లవారుజామున 3:30 నిమిషాలకు దండుమల్కాపురానికి చేరుకుంది. ఈ సమయంలో కృష్ణా జిల్లా అంగలూరకు చెందిన బస్సు డ్రైవర్ వెమన అంకనబాబు ముందున్న లారీ దాటబోతు అదుపు తప్పి వెనుక నుంచి లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బస్సు ఎడమ వైపు ముందు భాగం మొత్తం నుజ్జయినది. ముందు వరసులో కూర్చున్న ప్రయాణీకులు హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన పొట్లూరి రమాదేవి(56), బండ్లగూడకు చెందిన టెతని ఫణికుమార్(38), గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన డీవీఎన్ రామకృష్ణప్రసాద్(38), తాడేపల్లికి చెందిన పొట్టి రేణుక(24), విశాఖపట్నం జిల్లా కైలాసపురానికి చెందిన అక్కిరేట అప్పలరాజు(47), శోభనాద్రిచార్యులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మరో పది మంది ప్రయాణీకులు స్వల్పంగా గాయపడగా 108 అంబులెన్సులో చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్సను నిర్వహించారు. స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నవీన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు..!

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: కనగల్ మండలం కురంపల్లికి చెందిన ఇద్దరు సోదరులు దాసరి అన్నమయ్య, ఆంజనేయులు జంట హత్య కేసులో ముగ్గురు ప్రధాన నిందింతులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. వీరితో పాటు మరో నలుగురికి ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మిగిలిన వారి ఆచూకీతో పాటు హత్యకు దారి తీసిన ఘటనపై అదుపులో ఉన్నవారిని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	సుగుణ
ఫాంరేటు	82–00	84–00
రిటైల్	97–00	99–00
డ్రెస్డ్	136–00	144–00
స్కిన్‌లెస్	160–00	168–00

బ్యాంకు అధికారులమంటూ... ఏటీఎం పిన్ నంబరు తెలుసుకొని..

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: బ్యాంకు ఉన్నతాధికారులమంటూ ఏటీఎం పిన్ నంబరు తెలుసుకొని ఖాతాలో ఉన్న నగదును డ్రా చేసుకున్నారు సైబర్ నేరగాళ్లు... బాధితురాలైన మండలంలోని ముదిమాణిక్యంకు చెందిన శాంతి రాయ్ తెలిపిన వివరాల ప్రకారం... కలకత్తాకు చెందిన అకుల్‌రాయ్, శాంతిరాయ్ గత కొన్నాళ్లుగా ముదిమాణిక్యంలో నివాసముంటూ సమీపంలో గల కృష్ణానదిలో చేపలు పట్టుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. శాంతిరాయ్‌కు మిర్యాలగూడలోని యాక్సిస్‌బ్యాంకులో పొదుపు ఖాతా ఉంది. మంగళవారం ఆమెకు ఓ ఫోన్‌కాల్ వచ్చింది. తాను బ్యాంకు అధికారినని మీ ఏటీఎం గడువు పూర్తయిందని రెన్యూవల్ చేసేందుకు సీక్రెట్ నంబరు కావాలని అడుగగా ఆమె వారికి తెలియపరిచింది. కొద్దిసేపటి తరువాత వారి ఖాతా నుంచి రూ. 9,900, రూ. 2,998, 2,000, 2,800 చొప్పున నాలుగు విడతలుగా ఖాతాలో ఉన్న సుమారు రూ. 25వేలను సైబర్ నేరగాళ్లు డ్రా చేశారు. నగదు ఉపసంహరణ జరిగినట్లు సమాచారం రావడంతో బాధితురాలు బుధవారం బ్యాంకు అధికారులను సంప్రదించారు. వారి సూచన మేరకు అడవిదేవులపల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. తన సెల్‌కు వచ్చిన నంబరును ఫిర్యాదులో పేర్కొన్నట్లు బాధితురాలు తెలిపారు.

బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని..

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న ఎంవీఆర్ పాఠశాలలో వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న పి.స్వప్నకు ఈనెల 6న గుర్తు తెలియని వ్యక్తి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నానని చెప్పి ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ. 40వేలు డ్రా చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్సై హనుమంతరెడ్డి తెలిపారు. బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేస్తున్నామని.. ఏటీఎం నంబర్, పిన్ నంబర్ చెప్పాలంటూ మాయమాటలు చెప్పి ఖాతాలో ఉన్న నగదును తస్కరించారు. వేతనానికి సంబంధించిన నగదు ఖాతాలో పడిందో లేదో తనిఖీ చేయడానికి బుధవారం బ్యాంకుకు వెళ్లిన ఆమె విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై చెప్పారు.

బోనాల పండగ... ముత్యాలమ్మ బోనాలు.. వినాయకచవితి... దసరా, దీపావళి, పండుగలు.. స్వాముల దీక్షలు ప్రారంభానికి ముందుగానే పెద్దఎత్తున ఎలాంటి బిల్లులు లేకుండానే ఆంధ్ర ప్రాంతం నుంచి దేవుడి నూనె బాటిళ్లు సరిహద్దులు దాటించేస్తున్నారు. దేవుడి నూనెలు కదా అని ఎవరు పట్టించుకోని తీరుతో... వ్యాపారులు ఎలాంటి బిల్లులు లేకుండా రాష్ట్ర జిల్లా సరిహద్దులు దాటించి దర్జాగా విక్రయాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నాసి రకం నూనెలు దేవుడి దీపారాధనకు వినియోగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:



మిర్యాలగూడలో జోరుగా బిల్లులు లేకుండా విక్రయాలు

పొరుగు రాష్ట్రం నుంచి పోటెత్తిన నూనె

హద్దులు దాటిన అవినీతి

దేవుడి దీపాల కోసం నాసిరకం నూనెలు

పండగల సీజన్ వచ్చిందంటే చాలు దీపాలు వెలిగించేందుకు గాను ఇళ్లలో ఆలయాల్లోకి నూనెలను విరివిగా ప్రజలు కొనుగోలు చేస్తుంటారు. దీన్ని అదునుగా తీసుకుని గుంటూరు జిల్లాలోని పలువురు వ్యాపారులు రంగురంగుల బాటిళ్లలో నూనెలను నింపి వంద గ్రాములు, పావుకిలో, అర కిలో, ముప్పావు కిలో, కిలో బాటిళ్లకు లేబుళ్లు వేసి నేరుగా జిల్లాకు తరలిస్తున్నారు. గతంలో దామరచర్ల మండలం వాడపల్లి వద్ద సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద తనిఖీలు చేస్తున్నప్పటికీ స్థానికంగా విధుల్లో ఉన్న సిబ్బందిని మేనేజ్ చేసి తీసుకువచ్చేవారు.. జీఎస్టీ అమలుతో సరిహద్దుల్లోని వాణిజ్య పన్నుల చెక్ పోస్టులు తీసివేయటంతో చీకటి దందా వ్యాపారుల రాజ్యం సాగుతోంది. నెలకు సుమారుగా రూ.4 కోట్ల వరకు దేవుడి నూనెలను గుంటూరు జిల్లాకు చెందిన ఓవ్యాపారి జిల్లాకు తరలిస్తున్నట్లు సమచారం. కనీసం బిల్లులు లేకుండా వందల సంఖ్యలో సీసాలు, కార్టన్లతో మిర్యాలగూడలోని కిరాణదుకాణాలకు తరలిస్తున్నారు. దుకాణాల వారు సైతం బిల్లులు లేకుండా వస్తుండగా ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. పట్టణంలోని పాతబస్టాండు, గణేష్‌మార్కెట్, కుండల బజారు, సీతారాంపురం ప్రాంతాల్లోని కిరాణ దుకాణాల్లో బిల్లులు లేని నూనెల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

❖ దేవుడి నూనెలు అనే సరికి పోలీసులు , ఇతర శాఖల అధికారులు కూడా చూసిచూడనట్లు వదిలివేస్తుండగా వారి ఇష్టారాజ్యం సాగుతుంది. వ్యాపారులు నేరుగా ట్రాలీ ఆటో, డీసీఎంలో మిర్యాలగూడకు తీసుకువచ్చి స్థానికంగా సీతారాంపురంలో నిలిపి ఉంచి పట్టపగలే ఎలాంటి బిల్లులు లేకుండా నూనెలను కిరాణ దుకాణాలకు తరలిస్తున్నారు.

❖ దేవుడి నూనెల నాణ్యత పరిశీలించేందుకు ఎవరు ఇప్పటివరకు చర్యలు తీసుకోక పోతుండగా పూర్తిగా నాసిరకం కల్తీ నూనెలు, ఎముకల నూనెలను సైతం వ్యాపారులు కలుపుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

❖ నూనె కల్తీ అనగానే మిల్లుల వైపు మాత్రమే తనిఖీలు చేస్తున్న పోలీసు, విజిలెన్స్ అధికారులు కిరాణ దుకాణాలు, పూజసామాగ్రి విక్రయించే వ్యాపారుల దుకాణాలు తనిఖీలు చేయకపోతుండగా వీరు బిల్లులు లేకుండా నాసిరకం నూనెలను నేరుగా వినియోగదారులకు అంటగడుతున్నారు. కాలనీల్లోని చిరువ్యాపారుల వద్ద తనిఖీలు చేయకపోవటం వీరి ఇష్టారాజ్యం సాగుతోంది. ఇకనైనా సంబంధిత విజిలెన్స్, వాణిజ్య పన్నుల శాఖల అధికారులు తనిఖీలు చేసి బిల్లులు లేకుండా విక్రయించే దేవుడి నూనెల అక్రమాలను అంతుచూడాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు చేసి చర్యలు..

మస్తాన్‌వలీ, సీటీవో

బిల్లులు లేకుండా ఇతర ప్రాంతాల నుంచి నూనె సీసాలు వచ్చిన విషయం మా దృష్టికి రాలేదు. విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. దుకాణాల్లో తనిఖీలు చేసి బిల్లులు లేకపోతే చర్యలు తీసుకుంటాం. బిల్లులు లేకుండా సామగ్రి తీసుకు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

దేవాలయ భూమిని పరిశీలించిన తహసీల్దార్

● 'ఈనాడు' కథనానికి స్పందన

పంతంగి(చౌటుప్పల్‌గ్రామీణం),న్యూస్‌టుడే: పంతంగి గ్రామంలో జాతీయ రహదారి పక్కనే రూ.కోట్లు విలువ చేసే దేవాలయ భూమి అన్యాక్రాంతమవుతుందని బుధవారం ఈనాడు జిల్లా సంచికలో 'భూమికి లేదు హామి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ షేక్ అహ్మద్ స్పందించారు. దేవాలయ భూమిని పంతంగి, లింగోజిగూడెం వీఆర్వోలు పద్మనాభం, సత్యనారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. దేవాలయ భూమికి సంబంధించిన వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. పాత రికార్డులను, నకల్లను పరిశీలించారు. 80 సంవత్సరాలుగా ఈ భూమి దేవాలయ అధీనంలో ఉందని, రెవెన్యూ రికార్డులో సీతారామచంద్రస్వామి దేవాలయం పేరు వస్తుందని సర్పంచి అంతటి రమేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దూడల భిక్షంగౌడ్, పలువురు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో దేవాలయం పేరు మీద భూమిని కౌలుకు ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఇప్పుడు పంతంగిలోని సర్వే నంబర్లు 550, 553లు ఓవర్ ల్యాప్ అయ్యాయని చెప్పి దేవాలయ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ఎలా అనుకూలంగా సర్వే రిపోర్టు ఇస్తారని ప్రశ్నించారు. దేవాలయ భూమికి చుట్టు కంచె వేయించాలని కోరారు. తహసీల్దార్ స్పందిస్తూ అది సర్వే, ల్యాండ్ రికార్డులు వారు ఇచ్చిన రిపోర్టు మాత్రమేనని తెలిపారు. ఇప్పటికి రెవెన్యూ రికార్డులో దేవాలయం పేరు మీదనే భూమి ఉన్నట్టు గ్రామస్థులకు చెప్పారు. అవసరమైతే మరోసారి సర్వే చేయిస్తామని, దేవాలయ భూమిని ఇతరులకు పట్టా చేయమని స్పష్టం చేశారు.



పంతంగిలో విచారణ చేపడుతున్న తహసీల్దార్ షేక్ అహ్మద్

నేడు అంబేడ్కర్ యూనివర్సిటీలో ప్రవేశాలకు ఆఖరు తేది

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డా.బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, పీజీలో ప్రవేశాలకు గురువారం ఆఖరు తేదీ అని ఆ యూనివర్సిటీ ఉమ్మడి నల్గొండ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ బి.ధర్మానాయక్ తెలిపారు. జిల్లాలోని 13 అధ్యయన కేంద్రాలలో ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించి ప్రవేశాలు పొందవచ్చని చెప్పారు. ఎలాంటి విద్యార్హత లేనివారు, అర్హత పరీక్షలో అర్హత సాధించినవారు, ఇంటర్, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఎంబీఏలో చేరేందుకు ఐసెట్‌లో అర్హత సాధించి ఉండాలన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మీ సేవా కేంద్రాల ద్వారా ఫీజు చెల్లించి ప్రవేశాలు పొందాలని సూచించారు.

ఆయుధాల వినియోగంలో నైపుణ్యం ప్రదర్శించాలి

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: ఆయుధాల వినియోగంలో పోలీస్ సిబ్బంది నైపుణ్యం ప్రదర్శించాలని ఎస్పీ ఎన్.ప్రకాష్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ మైదానంలో బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ పొందుతున్న 15 మంది పోలీస్ సిబ్బందికి ఆయుధ వినియోగంపై బుధవారం మెలకువలు నేర్పించారు. ఇజ్రాయెల్‌కు సంబంధించిన క్రోమగ యుద్ధ విద్యపై అవగాహన కల్పించారు. మానవ హక్కులకు భంగం కలగకుండా చట్టపరిధికి లోబడి నేరస్థులను ఆదీనంలోకి తీసుకునే విధంగా శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఓఎస్డీ శ్రీనివాస్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దుండగులను గురి చూసి కాల్చాలని శిక్షణ ఇస్తున్న సిబ్బంది

ముస్లింలకు బీసీఇ సర్టిఫికెట్ జారీ చేయాలి

కేతేపల్లి,న్యూస్‌టుడే: అణగారిన ముస్లిం ప్రజలకు బీసీఇ ధ్రువపత్రాలు జారీ చేయకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని డీసీసీ మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ యూసుఫ్‌జానీ పేర్కొన్నారు. కేతేపల్లిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదముస్లిం ప్రజల జీవన స్థితిగతులపై ఇప్పటికే ప్రభుత్వాలు వివిధ కమీషన్లను నియమించి తెప్పించిన నివేదికలలో సమాజంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలకంటే ముస్లింలు వెనుకబడి ఉన్నారని తేల్చిచెప్పారని పేర్కొన్నారు. ముస్లింలకు బీసీఇ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే కేతేపల్లి మండలంలో కొందరు అధికారులు ముస్లింలకు బీసీఇ ధ్రువపత్రాలు ఇవ్వకుండా లేనిపోని నిబంధనలు చెబుతుండటంతో విద్యార్థులు, యువకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి

చింతపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని మహిళ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సూర్యాపేట, నల్గొండ జిల్లాల ఆర్గనైజర్ మాలె శరణ్యారెడ్డి అన్నారు. జిల్లాలో ఆరోగ్యలక్ష్మి పథకాన్ని సమర్థంగా అమలు చేసినందుకు జిల్లా కలెక్టర్‌కు ఎక్సలెన్స్ అవార్డు రావడంతో బుధవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాకు ఎక్సలెన్స్ అవార్డు వచ్చిన నేపథ్యంలో బాధ్యత పెరిగిందని, క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ముందుకు నడవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పుష్పలత మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించాలని, కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో లావణ్యకుమారి, సూపర్‌వైజర్లు దేప వెంకటమ్మ, జ్ఞానేశ్వరి, యాదమ్మ, సత్తమ్మ, పద్మ, శశికళ, మంజుల తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను పంపిణీ చేస్తున్న శరణ్యారెడ్డి, పీడీ పుష్పలత

అలరించిన బతుకమ్మ సంబురాలు

ఆరోగ్యలక్ష్మి పథకం నిర్వహణకు గాను జిల్లాకు రాష్ట్ర స్థాయిలో అవార్డు రావడంతో సీడీపీవో కార్యాలయ ఆవరణలో సంబురాలు ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళ, స్త్రీ, శిశు సంక్షేమ సంఘం జిల్లా ఆర్గనైజర్ మాలె శరణ్యారెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ పుష్పలత, సీడీపీవో లావణ్యకుమారి, సూపర్‌వైజర్లు దేప వెంకటమ్మలతోపాటు అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ఆనందోత్సవాల నడుమ బతుకమ్మ ఆడారు. ఆరోగ్యలక్ష్మి కింద నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన ఉపాధ్యాయులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో చింతపల్లి, మర్రిగూడ, నాంపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ ఆవిర్భావం

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నల్గొండలోని ఎస్‌టీయూ భవనంలో బుధవారం ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ(జేఏసీటీఓ) ఆవిర్భవించింది. ఎస్‌టీయూటీఎస్, టీపీఆర్‌టీయూ, టీపీయూ, టీఆర్‌టీయూ, టీటీఎఫ్, బీటీఏ, టీడీటీఎఫ్, టీఎస్‌టీఎఫ్, ఎస్ఎల్‌టీఏ, టీఎస్‌టీయూ, ఏటీఏ, ఎస్‌యూటీఏ, ఏటీజీ, టీజీహెచ్‌ఎం, టీఏటీజీ, పీటీఏటీఎస్, ఎంటీయూ, టీఎస్‌టీడబ్ల్యూటీయూ కలిసి ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీగా ఏర్పడ్డాయి. సమావేశానికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఒంటెద్దు భిక్షంరెడ్డి, కె.వీరరాఘవులు, కొడిదల శంకర్, ఎండీ అలీం, కంకణాల లింగారెడ్డి, ఘనపురం భీమయ్య, ప్రభాకర్, బుచ్చిరాములు, నరేందర్‌రెడ్డి, భానుప్రకాష్, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, రమేష్, జగదీశ్వర్‌రెడ్డి, శివలింగయ్య, జాన్‌ఖాన్, విజయప్రసాద్, సాయిబాబా, శేఖర్‌రెడ్డి పాల్గొన్నాఉ. ఆదివారం ఉదయం 10.30కు నిరసన ర్యాలీ, సోమవారం డీఈఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ, కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించడం, సెప్టెంబర్ 1న సీపీఎస్ రద్దు కోరుతూ సామూహిక సెలవు పెట్టాలని నిర్ణయించారు.



పాల్గొన్న వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మునుగోడు

నూతన కమిటీ నియామకం

చండూరు, న్యూస్‌టుడే: టీయూడబ్ల్యూజే మండల కమిటీ సమావేశం బుధవారం చండూరులో జరిగింది. మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బొడ్డు సతీష్, ప్రధాన కార్యదర్శిగా బోయపల్లి రమేష్, ఉపాధ్యక్షునిగా గంట శ్రీనులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల అంజయ్య, మునుకుంట్ల గాలయ్య, నటవ కృష్ణారావు, బ్రహ్మం, నాగరాజు, గంగాధర్‌గౌడ్, రాంబాబు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

చండూరు, న్యూస్‌టుడే: మండలంలోని పలుగ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి గురువారం పర్యటిస్తున్నట్లుగా తెరాస మండల పార్టీ అధ్యక్షుడు పెద్దగాని వెంకన్నగౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత 8 గంటలకు తెరటుపల్లి ప్రారంభమై పుల్లెంల, చండూరు, శిర్ధేపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు, పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి (మర్రిగూడ), న్యూస్‌టుడే: 2017-18 విద్యా సంవత్సరంలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలు పొందగోరే అభ్యర్థులు సెప్టెంబర్ 4లోపు దరఖాస్తు చేసుకోవాలని నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల కోఆర్డినేటర్ బోయపల్లి రాంశెట్టి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ కె.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని వారు కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: 2017-18 సంవత్సరానికి సంబంధించి ఎస్టీ స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాయితీ రుణాల కోసం సెప్టెంబర్ 15 లోపు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో సరస్వతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపురం మండలానికి గాను స్వయం ఉపాధికి - 27 యూనిట్లు, వ్యవసాయ అనుబంధ యూనిట్లు - 16, పశుగణాభివృద్ధి యూనిట్లు - 12 మంజూరైనట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ చేసుకున్న దరఖాస్తు దారుడు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింటును తీసుకొని సంబంధిత ధ్రువపత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విశ్వబ్రాహ్మణుల నిరసన

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లో తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈశ్వరీమాతను, విశ్వబ్రాహ్మణ కులాన్ని దూషించే విధంగా టీవీ9లో ప్రసారం చేసినందుకు వారు నిరసన తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల కమిటీ అధ్యక్షుడు బొల్లోజు రవికుమార్, గౌరవాధ్యక్షుడు మండలోజు భిక్షమాచారి, ఉపాధ్యక్షుడు వినుకొండ శ్రీనివాసచారి, పోలోజు మారయాచారి, మురళీధరాచారి, ప్రధాన కార్యదర్శి కూరెళ్ల రామాచారి, కోశాధికారి వెంకటరమణాచారి పాల్గొన్నారు.

జయలక్ష్మీ మృతికి సంతాపం

లింగోజిగూడెం(చౌటుప్పల్‌గ్రామీణం),న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భాజపా మండల మహిళా మోర్చా నాయకురాలు పర్నె జయలక్ష్మీ మృతదేహాంను బుధవారం భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగిడి మనోహర్‌రెడ్డి సందర్శించారు. ఆమె మృతదేహాంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. లింగోజిగూడెంలో నిర్వహించిన అంత్యక్రియల్లో భాజపా రాష్ట్ర కమిటీ సభ్యుడు దూడల భిక్షంగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దోనూరి వీరారెడ్డి, వైస్ ఎంపీపీ కాయితి రమేష్‌గౌడ్, జిల్లా నాయకులు బాతరాజు సత్యం, రమణగోని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కన్వీనర్‌గా ఎన్నిక

ఎస్.లింగోటం(చౌటుప్పల్‌గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామానికి చెందిన లోడే భిక్షమయ్యగౌడ్‌ను భాజపా జిల్లా గీతాసెల్ జాయింట్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు బుధవారం భిక్షమయ్యగౌడ్‌కు నియామకపు పత్రాలను అందజేశారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి పని చేస్తానని, తన నియామకానికి సహకరించిన నేతలందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సినిమాలు

చౌటుప్పల్
అంజిరెడ్డి: జయ జానకి నాయక
శ్రీనివాస: నేనే రాజు నేనే మంత్రి

మీరూ స్పందించండి..

మునుగోడు నియోజకవర్గంలో మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' వేదికగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా సమస్యను ఫొటో తీసి, సంబంధిత వివరాలు క్లుప్తంగా రాసి వాట్సాప్ ద్వారా మాకు పంపించండి. వాట్సాప్ నెంబర్లు:

చండూరు: 80085 74384,
సంస్థాన్‌నారాయణపురం : 9848608700
చౌటుప్పల్ : 80085 74968
చౌటుప్పల్ గ్రామీణం: 80085 74387
మునుగోడు: 80085 66199
మర్రిగూడ: 8008574409

రోడ్డుకు మరమ్మతులు



చండూరు, న్యూస్‌టుడే: చండూరు నుంచి మునుగోడుకు వెళ్లే బైపాస్ మట్టి రోడ్డు గుంతలు పడి ప్రయాణించడానికి వీలులేకుండా పోయింది. సమస్యను చండూరుకు చెందిన రావిరాల అశోక్ మీరు స్పందించండి వాట్సాప్‌కు పంపించారు. స్పందించిన చండూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు బిల్ కలెక్టర్ కారంపొడి శ్రీనుతో కలిసి రోడ్డును పరిశీలించారు. అతి త్వరలో రోడ్డు మరమ్మతులు చేపడుతామని తెలియజేశారు.



మట్టిరోడ్డును పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు

బురదగుంతలతో అవస్థలు

సమస్య: చండూరులోని ఎన్‌టీఆర్ నగర్‌లో సరైన మురుగుకాల్వ సదుపాయం లేకపోవటంతో ఎక్కడికక్కడ గుంతలుపడి కాలనీ అధ్వానంగా మారింది.

పంపినవారు: సుఖేందర్, చండూరు.

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి, చండూరు.

సేకరణ: చండూరు, న్యూస్‌టుడే:



బురదమయమైన గుంతలతో ఉన్న చండూరులోని ఎన్‌టీఆర్ నగర్

అధ్వానంగా కాల్వ

సమస్య: మండలంలోని కుమ్మరి వీధిలో మురుగుకాల్వలో మురుగు పేరుకుపోయి దుర్వాస వస్తోంది. దీంతో దోమలు సంచరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రోగాలు వచ్చే ప్రమాదముంది. మురుగుకాల్వలు శుభ్రం చేయించాలి.

పంపినవారు: **- లింగస్వామి, నారాయణపురం**

సమాధానం: మురుగుకాల్వలు శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం.

- రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి

సేకరణ: సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే



నారాయణపురం కుమ్మరి వీధిలో కాల్వలో పేరుకుపోయిన మురుగు నీరు

వృథాగా కృష్ణా జలాలు

మర్రిగూడ, న్యూస్‌టుడే: అతివృష్టి, అనావృష్టి అన్న చందంగా ఉంది కృష్ణానీటి సరఫరా పరిస్థితి. కొన్ని మండలాలకు నీటి సరఫరా జరగని పరిస్థితి... సరఫరా జరుగుతున్న మండలాల్లో లీకేజీల బెడద... వెరసి కృష్ణాజలాలు వృథాగా పోతున్నాయి. మర్రిగూడ మండల కేంద్రానికి సమీపంలో వారం రోజులుగా కృష్ణానీరు వృథాగా పోతోంది. గతంలో ఇక్కడ పైపులైను పగిలి నీరు వృథా అవుతుంది. తూతూ మంత్రంగా మరమ్మతులు చేసారే తప్పా, పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయలేదు. దీంతో కృష్ణానీరు లీకేజీ జరిగి విలువైన జలాలు రహదారిపై పారుతున్నాయి. అనేకసార్లు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మరమ్మతు పనులు చేయాలంటూ అధికారులను ఆదేశించినా, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఈ లీకేజీ నీరు వృథాగా పోతున్నా, అధికారుల దృష్టికి ఈ సమస్య కనిపించడంలేదు. ఈ పైపులైన్ ద్వారా వట్టిపల్లి, భీమనపల్లి, కమ్మగూడెం, భోజ్యతండాలకు కృష్ణా నీటి సరఫరా జరుగుతుంది. నీరు లీకేజీతో కలుషితమవుతున్నాయి. లీకేజీ జరుగుతున్న గుంత కనిపించకుండ పైన కంపవేశారు. వర్షం కురిసిన సమయంలో అనేక మలినాలు నీటిలో కలుస్తూ నీరు కలుషితమవుతుంది. సాగర్‌లో నీటిమట్టం పడిపోవడంతో ఎడవెల్లి ప్రాజెక్టుకు నీటి సరఫరా జరగక చండూరు మండలంలో అనేక గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. నాంపల్లి మండలంలోని అనేక గ్రామాలకు నేటికీ కృష్ణా నీటి సరఫరా లేదు. మర్రిగూడ మండలంలో కృష్ణాజలాల సరఫరా జరుగుతున్నా లీకేజీల బెడద ఎక్కువగా ఉంది. లీకేజీ సమస్యను అరికట్టి నీటి సరఫరాను మెరుగు పర్చాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



మర్రిగూడ చౌరస్తాలో రహదారిపై వృథాగా పోతున్న కృష్ణాజలాలు

దాతల సహాయం అభినందనీయం

పుట్టపాక (సంస్థాన్ నారాయణపురం), న్యూస్‌టుడే: విద్యాభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని నల్గొండ డీఈవో చంద్రమోహన్ తెలిపారు. బుధవారం మండలంలోని పుట్టపాక గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో గజం రాములు - రాంబాయ్య తన మనవరాలు సాయినైనా జ్ఞాపకార్థం నిర్మించిన స్టేజీని డీఈవో ప్రారంభించారు. అదేవిధంగా సాయినైనా తల్లిదండ్రులు గజం మురళి - మమతలు విద్యార్థులకు కావాల్సిన వైట్ మార్కర్ బోర్డులకు రూ.50 వేలను ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈవో మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి నల్గొండ కళమ్మ, ఎంపీటీసీ సభ్యుడు సామల వెంకటేశం, ఎస్ఎంసీ ఛైర్మన్ ఉమాశంకర్, నల్గొండ డీసీఎంఎస్ డైరెక్టర్ రాపోలు దత్తగణేష్, ఉపాధ్యాయ బృంధం హైమావతి, సంతోష్‌కుమారి, శ్రీరాములు పాల్గొన్నారు.

మునుగోడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని సర్పంచి గులిజ రామచంద్రం అన్నారు. బుధవారం మండలంలోని కచిలాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన నాగం మధుసూదన్‌రెడ్డి విద్యార్థులు సొంత ఖర్చులతో బూట్లు పంపిణీచేయగా, సర్పంచి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముచ్చపోతుల నటరాజ్, ఎస్ఎంసీ ఛైర్మన్ రంజాన్, వైస్ ఛైర్మన్ రేణుక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పుట్టపాక పాఠశాలలో స్టేజీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నల్గొండ డీఈవో చంద్రమోహన్ తదితరులు

రాబోయే కాలంలో ఓట్ల విప్లవం వస్తుంది

చౌటుప్పల్, న్యూస్‌టుడే: రాబోయే రోజుల్లో ఓట్ల విప్లవం రానున్నదని ప్రజా గాయకుడు గద్దర్ అన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక (టీమాస్) సమావేశంలో పాల్గొనివస్తూ ఆయన బుధవారం సాయంత్రం చౌటుప్పల్‌లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా గద్దర్ విలేకరులతో మాట్లాడారు. 'నన్ను గన్న నల్గొండరో మాయన్న... వీరులగన్న వీరగడ్డరో మాయన్న... శూరులగన్న సూర్యపేటలో ఓయన్న ... చరితగన్న చౌటుప్పలరో ఓయన్న' అని పాటతో గద్దర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రపంచ చరిత్రలో నల్గొండకు ఓ ప్రత్యేక చరిత్రున్నది. ప్రస్తుతం 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న యువత దేశంలో 67 శాతం ఉందన్నారు. 93 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదవర్గాలు మారాజ్యం మాకే కావాలి.. మా పాలన మేమే చేసుకుంటాం.. మా సమస్యలు మేమే పరిష్కరించుకుంటామని మరో ఉద్యమానికి నడుం బిగించబోతున్నారని తెలిపారు. ఆయనతో పాటు స్థానిక గీత కార్మికుడు వెంకటేశ్ ఉన్నారు.



చౌటుప్పల్‌లో పిల్లలతో గద్దర్

సెలవు దినాన్ని జయప్రదం చేయాలి

నాంపల్లి (మర్రిగూడ), న్యూస్‌టుడే: సీపీఎస్ పింఛన్‌ను రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న జరుగు సామూహిక సెలవులో సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి గేర నర్సింహా పిలుపునిచ్చారు. బుధవారం నాంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమై ఆయన మాట్లాడారు. మర్రిగూడ మండలం శివన్నగూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్ జాతీయ పురస్కారానికి ఎంపిక కావడంపట్ల ఉపాధ్యాయ బృందం ప్రభుత్వాలకు, జిల్లా, మండల విద్యాధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పల్లేటి వెంకటయ్య, లలిత్‌మోహన్, నారాయణ, దీవంత తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు

అవార్డు గ్రహీతకు సన్మానం

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: ఉద్యోగ రీత్యా అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను ఉత్తమ ఎస్సైగా అవార్డు అందుకున్న నారాయణపురం ఎస్సై మల్లీశ్వరిని బుధవారం స్థానిక ఠాణాలో గుజ్జ గ్రామానికి చెందిన హనుమాన్ యువజన సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో యువజన అధ్యక్షుడు బంగారు వెంకటేశం, గౌరవ అధ్యక్షుడు ఏనుగు బాబు, పాల్వాయి జగదీష్, పద్మబోయిన శంకర్, గంగదేవి ప్రవీణ్, నెల్లికంటి శివ, వేణు, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుని మృతి

మేటిచందాపురం (మర్రిగూడ), న్యూస్‌టుడే: మేటిచందాపురానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచి లపంగి రాములు(70) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతికి కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తూ అంత్యక్రియలలో పాల్గొని నివాళి అర్పించారు. జడ్పీటీసీ మేతరి యాదయ్య, మద్ది విఠల్‌రెడ్డి, కుంభ శ్రీనివాసరెడ్డి, రవి, మల్లేష్‌లు ఆయన మృతికి సంతాపం తెలియజేశారు.

మల్లేశ్ మృతి తీరని లోటు

మునుగోడు, న్యూస్‌టుడే: తెలంగాణ గుడిసెవాసుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి మల్లేషం తీరని లోటని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లె రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గూడాపూర్ గ్రామంలో మల్లేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మల్లేష్ దహన సంస్కారాలకు రూ. 25వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దీంతోపాటు తమ పిల్లల చదువులకు కూడా సహాయ సహకారాలు అందించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పాలకూరి రాజు, పోగుల ప్రకాష్, ఈదుల కంటి కైలాష్, సర్పంచి దేశిడి యాదయ్య తదితరులున్నారు.

☆ మునుగోడు గ్రామపంచాయతీ పరిధిలోని గంజ్గోరిగూడెంకి చెందిన యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు సోదరుడు జంగిలి విజయ్‌కుమార్ ఇటీవల పురుగులమందు తాగి మృతిచెందారు. బుధవారం వారి కుటుంబసభ్యులను టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లె రవికుమార్ పరామర్శించారు.

ఐకేపీ సిబ్బంది ధర్నాతో నిలిచిన పనులు

మర్రిగూడ, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి ఐకేపీ సిబ్బంది కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు చేస్తున్న సమ్మెతో మర్రిగూడ ఐకేపీ కార్యాలయంలో పనులు నిలిచిపోయాయి. కంప్యూటర్ ఆపరేటర్లు లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. వారి సమస్యల పరిష్కారానికి ఈనెల 16 నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్నారు.

ఎస్ఎంసీ ఛైర్మన్ ఎంపిక

కొండాపురం(చండూరు), న్యూస్‌టుడే: కొండాపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్ఎంసీ ఛైర్మన్ ఎంపికలో గ్రామానికి చెందిన బొడ్డోజు శంకరయ్య ఎంపికయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచి గాదె పుష్పమ్మ, ఎంపీటీసీ సభ్యుడు అవ్వారి వేణుకుమార్, అవ్వారి భాస్కర్, పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో వైద్య శిబిరం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లోని అనాథాశ్రమంలో బుధవారం వైద్య శిబిరం జరిగింది. స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సుభాషిణి, వైద్య నిపుణుడు పాండురంగం, ఆరోగ్య సిబ్బంది అనాథాశ్రమాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న అనాథలకు, మానసిక వికలాంగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన ఔషధాలను పంపిణీ చేశారు. విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలుతున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆశ్రమ నిర్వాహకులకు సూచించారు. శిబిరంలో ఆశ్రమ నిర్వాహకుడు జి.గిరి పాల్గొన్నారు.

మృతదేహాలతో గ్రామస్థుల ఆందోళన

నెర్మట(చండూరు), న్యూస్‌టుడే: కనగల్ మండలం కురంపల్లిలో బుధవారం హత్యకు గురైన దాసరి ఆంజనేయులు(19), దాసరి అన్నమయ్య(21)ల మృతదేహాలను మంగళవారం రాత్రి స్వగ్రామం చండూరు మండలం నెర్మటకి తరలించారు. హత్యలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ మృతుల బంధువులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. నిందితులతో పాటు వారికి సహకరించిన వారిని శిక్షించే వరకు అంత్యక్రియలు జరిపేది లేదని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చండూరు సీఐ రమేష్, చండూరు, మునుగోడు ఎస్సైలు భాస్కర్‌రెడ్డి, రాములు మృతుల బంధువులకు నచ్చజెప్పారు. చట్ట ప్రకారంగా హత్యకు సంబంధించిన వారిని కఠినంగా శిక్షిస్తామని నచ్చజెప్పటంతో వారు శాంతించారు. అనంతరం అంత్యక్రియలు జరిగాయి. ఎంపీపీ తోకల వెంకన్న బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

సిబ్బంది నిర్లక్ష్యమే...


ఏడోవార్డులోని ఓ కాలనీలో ఇళ్ల ముందు నిలిచిన మురుగు నీరు

❍ మురుగు కాల్వ అపరిశుభ్రత వల్లే వస్తున్నాయని ఆరోపిస్తున్న కాలనీవాసులు.
❍ సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు చర్యలు తీసుకోని ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది.

మునుగోడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని 7వ వార్డులోని ఓ కాలనీలో ఒకే ఇంటికి చెందిన మహ్మద్ సఫియా, మహ్మద్ జానీ మియా, ఐదేళ్ల చిన్నారి ఇజ్వన్ గత వారం రోజులుగా విష జ్వరాలతో బాధపడుతున్నారు. గత వారం రోజులుగా నల్గొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇప్పుడిప్పుడే వీరిలో చిన్నారి ఇజ్వన్, జానీ మియా కోల్కొంటున్నారు. కానీ సఫియాకు మాత్రం జ్వరం తగ్గకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో డబ్బులు పెట్టలేక ఇంటికి తీసుకవచ్చి ఇంటి వద్దనే వైద్యం అందిస్తున్నామని ఆ కుటుంబ సభ్యులు తెలిపారు.

దోమలతో ఉండలేక పోతున్నాం

పుష్పలత, కాలనీవాసి.

రాత్రిళ్లు దోమల బెడదతో తట్టుకోలేకపోతున్నాం. మా కాలనీలో మురుగు కాల్వను నెలల తరబడి శుభ్రతకు నోచుకోవడం లేదు. ఇప్పటికే మా కాలనీలో కొందరికి విష జ్వరాలతో బాధపడుతున్నారు.

శుభ్రతకు నోచుకోని మురుగు కాల్వ..

ఆ కాలనీలో ఈ ఏడాదిలో కేవలం రెండుసార్లు మాత్రమే మురుగు కాల్వను శుభ్రం చేశారని ఆ కాలనీవాసులు తెలిపారు. పలుమార్లు గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని రోజు రాత్రి సమయంలో దోమల బెడదతో తట్టుకోలేకపోతున్నామని గ్రామ పంచాయతీ నిర్లక్ష్యం వల్లే జ్వరాలు ప్రబలిస్తున్నాయని ఇంకా ఎంతమందికి జ్వరాలు వస్తాయోనని భయంతో ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుస్థితి మండల కేంద్రంలో ప్రతి కాలనీలో ఇలాంటి సమస్యలు ఉన్నప్పటికీ గ్రామ పాలకవర్గం, పంచాయతీ సిబ్బంది తమ వీధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని వారి పనితీరుపై గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మురుగుకాల్వపై మట్టికట్టలు వేసి నిరసన తెలిపిన కాలనీవాసులు

ఎన్నో నెలలుగా మురుగు కాల్వను శుభ్రం చేయకపోవడంతో మురుగు కాల్వ ఉన్న ఉపయోగం సున్నా అని ఆగ్రహంతో బుధవారం ఆ కాలనీవాసులంతా కలిసి ఆ మురుగు కాల్వలో మట్టి బస్తాలు నింపి వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు.


విషజ్వరంతో బాధపడుతూ ఇంటిలో చికిత్స పొందుతున్న సఫియా

సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు చర్యలేవి

సీజనల్ వ్యాధుల కాలం కావడంతో ఏ రోగాలు ఎలా వస్తాయోనని అవగాహన కల్పించేందుకు మండల ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఇప్పటి వరకు ఎలాంటి ముందస్తు అవగాహన కార్యక్రమాలు చేపట్టలేదు. అంతేకాకుండా మురుగు కాల్వలను శుభ్రం చేసిన తర్వాత బ్లీచింగ్, ఫాగింగ్ వేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఏదైన వ్యాధులు వచ్చినప్పుడే వైద్య సిబ్బంది ఉరుకులు పరుగులు తీసి శిబిరాలు ఏర్పాటు చేస్తారు కానీ ముందస్తుగా చర్యలు తీసుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన గ్రామ పాలకులు, వైద్య సిబ్బంది స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

ఆర్థిక సాయం అందజేత

దోనిపాముల(చండూరు), న్యూస్‌టుడే: దోనిపాములకి చెందిన మానుక అంజమ్మకు సీఎం సహాయ నిధి నుంచి రూ. 75వేలు చెక్కును ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి బుధవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో అంజేశారు. కార్యక్రమంలో తెరాస మండల నాయకుడు కోడి వెంకన్న, చిలువేరు నరేష్, మానుక అనంతరెడ్డి తదితరులున్నారు.

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మసీదుగూడెంకి చెందిన చెక్కు ఇందిరమ్మకు సీఎం సహాయ నిధి రూ. 12వేలు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరయ్యాయి. ఈ చెక్కును ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఇందిరమ్మ భర్త నర్సింహకు హైదరాబాద్‌లో అందజేశారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు వాకిటి సత్తిరెడ్డి, సత్తిరెడ్డి, భూపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, శివారెడ్డి, రవీందర్‌రెడ్డి, పాండురెడ్డి పాల్గొన్నారు.

నాంపల్లి (మర్రిగూడ), న్యూస్‌టుడే: నాంపల్లి మండలం పస్నూరుకి చెందిన వరికుప్పల లింగస్వామికి సీఎం సహాయ నిధి నుంచి రూ. 60వేలు మంజూరయ్యాయి. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందిన ఆయన సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రూ. 60 వేలు ఆయనకు మంజూరయ్యాయి. స్థానిక సర్పంచి పోగుల వెంకట్‌రెడ్డి బుధవారం ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో లింగస్వామి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.


నర్సింహకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని చౌటుప్పల్ సర్పంచి బొంగు లావణ్య కోరారు. ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మంజూరు చేసిన రూ. 5 లక్షల నిధులతో మహిళా భవనం నిర్మాణానికి ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడారు. బ్యాంకులు అందిస్తున్న రుణ సహాయంతో స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటు చేసుకున్నట్లైతే ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశముంటుందని చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బొడ్డు ఉపేంద్ర, దండ అరుణ్‌కుమార్, మునుకుంట్ల పద్మావతి, బాబాషరీఫ్, బత్తుల విప్లవకుమార్, కాసోజు గోవర్ధన్, సంఘబంధం సభ్యులు పోలోజు జ్యోతి, గోశిక హైమావతి, గోశిక శ్రీవిద్య, పేరేపల్లి పుష్పలత, ముటుకుల్లోజు నీరజ, పిల్లలమర్రి పార్వతి, దావపల్లి లక్ష్మీ, గోశిక లక్ష్మీ, బొబ్బిళ్ల యశోద, దనమ్మ, పల్లం అండాలు, రాజపేట శ్రీలత, మలిగె మహేశ్వరి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ఇండియన్ బ్యాంకు 111 సంవత్సరాలుగా ఖాతాదారులకు నమ్మకమైన సేవలందిస్తున్నదని ఆ బ్యాంకు చౌటుప్పల్ శాఖ మేనేజర్ వై.నరేష్ తెలిపారు. స్థానిక బ్యాంకు కార్యాలయంలో బుధవారం 111వ వార్షికోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఖాతాదారుల సమావేశంలో నరేష్ మాట్లాడారు. రైతులకు, మహిళా సంఘాలకు, చిన్న వ్యాపారులకు వారి ఉపాధి మెరుగుదల కోసం రుణ సహాయం చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ రాయితీ పథకాల అమలులో తమవంతు సహకారం అందిస్తున్నామని వివరించారు. నెట్ బ్యాంకింగు సేవలను సైతం అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్ రాజు, మదన్‌మోహన్, నర్సింహ, శకుంతల పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి దివీస్ సహకారం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: హరితహారంలో మొక్కల పెంపకానికి దివీస్ లేబొరేటరీస్ యజమాన్యం ట్రీగార్డులు బహుకరించినందుకు చౌటుప్పల్ ఎంపీడీవో జి.రజిత కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక మండల పరిషత్, రాజస్వ మండలాధికారి, తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో హరితహారం పథకంలో మొక్కలు పెంచడానికి రూ. 2,10,000 విలువైన 300 ట్రీగార్డులను దివీస్ యాజమాన్యం స్థానిక సర్పంచి లావణ్య చేతులమీదుగా సంబంధిత అధికారులకు బుధవారం అప్పగించారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ శేషాద్రి, ఉపాధి హామీ పథకం ఏపీవో ప్రశాంతి, క్షేత్ర సహాయకుడు లింగస్వామి, దివీస్ అధికారులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని చౌటుప్పల్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ ఎస్. నవీన్‌కుమార్ కోరారు. స్థానిక వాసవి వనితా ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం 500 మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని నవీన్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి బొంగు లావణ్య, డీజీ మర్యాల చంద్రమౌళిగుప్త, వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు పొలుగు రజిత, గౌరవాధ్యక్షురాలు మంచికంటి ప్రమీల, నాంపల్లి అమృత, గట్టు లక్ష్మి, సముద్రాల వాణి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


చౌటుప్పల్‌లో వినాయక ప్రతిమల పంపిణీని ప్రారంభిస్తున్న పోలీస్ ఇన్స్‌పెక్టర్ నవీన్‌కుమార్

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని పోలీస్ ఇన్స్‌పెక్టర్ ఎస్. నవీన్‌కుమార్ పేర్కొన్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని చౌటుప్పల్‌లోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల సభ్యులతో శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఇన్స్‌పెక్టర్ మాట్లాడారు. జడ్పీటీసీ సభ్యుడు పెద్దిటి బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భూపాల్‌రెడ్డి, ఎస్సై సాయిలు తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు: వినాయక మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని పోలీస్ ఇన్స్‌పెక్టర్ ఎస్. నవీన్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం చౌటుప్పల్ పట్టణంలోని పలు దుకాణాదారులకు నోటీసులను అందజేశారు. డీజేలను, సౌండ్ బాక్స్‌లను ఏర్పాటు చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బాలాలయంలో బుధవారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఆరాధనల్లో భాగంగా వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు ప్రతిష్ఠమూర్తులకు హారతిని నివేదించారు. ఉత్సవమూర్తులను పాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. వేదమంత్ర పఠనాల మధ్య కవచ

ఆలయంలో స్వామి ఆరాధనలు

మూర్తులను స్వర్ణ పుష్పాలతో అర్చించి ఆరాధించారు. మహా మండపంలో సహస్రనామాలతో ఆరాధిస్తూ అష్టోత్తరం చేపట్టారు. మండపంలో శ్రీ స్వామికి నిత్యకల్యాణం నిర్వహించారు. లక్ష్మీసమేతుడయ్యేందుకు నారసింహుడు గజవాహనోత్సవాన్ని పొందారు. శాస్త్రోక్త పర్వాల మధ్య జరిగిన కల్యాణోత్సవంలో తలంబ్రాలధారణ జరిగాక ఆర్జిత భక్తులకు అక్షింతలతోపాటు శ్రీస్వామి అమ్మవారుల ఆశీస్సులు అందజేశారు. సాయంత్రంవేళ అలంకార సేవోత్సవాన్ని చేపట్టారు. రాత్రి ప్రతిష్ఠాలయంలో ఆరాధన, సహస్రనామార్చన నిర్వహించారు.

★ అనుబంధంగా కొనసాగుతున్న చరమూర్తుల ఆలయంలో రామలింగేశ్వరుడిని ఆరాధిస్తూ పూజారులు పూజలు చేపట్టారు. అభిషేకం, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పుష్కరిణి చెంత ఆంజనేయస్వామి గుళ్లో అభిషేకం, అర్చనలు కొనసాగాయి.

★ పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలోనూ నిత్యారాధనలు సంప్రదాయంగా జరిపారు. కల్యాణోత్సవంలో భాగంగా సేవోత్సవాన్ని తిరువీధుల్లో జరిపారు.

నేడు హుండీ లెక్కింపు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బాలాలయంలోని హుండీలలో భక్తులు సమర్పించిన నగదు, నగల కానుకల లెక్కింపు గురువారం జరుగుతుంది. ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు పర్వం మొదలవుతుందని దేవస్థానం ఈవో ఎన్.గీత పేర్కొన్నారు.



అలంకార సేవోత్సవం

నిత్యరాబడి

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఖజానాలో బుధవారం వివిధ విభాగాల ద్వారా రూ. 6,92,203 నిత్యరాబడి పద్దు కింద జమయ్యాయని దేవస్థానం ఈవో ఎన్.గీత తెలిపారు. ఈ రాబడిలో ప్రధాన పూజలతో రూ. 65,546, ప్రత్యేక దర్శనాలతో రూ. 49,700, వ్రతాలతో రూ. 77,000, కల్యాణకట్టతో రూ. 30,000, అద్దె గదులతో రూ. 61,680, శాశ్వత పూజలు రూ. 21,348, అన్నప్రసాదం విరాళం రూ. 14,146, ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 2,85,100 మిగతావి వివిధ విభాగాల చేకూరాయని ఈవో వివరించారు.

మల్లాపురంలో ఆలయోద్యోగుల శ్రమదానం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట దేవస్థానానికి చెందిన మల్లాపురంలోని తోటలో ఆలయోద్యోగులు బుధవారం శ్రమదానం చేపట్టారు. ఉద్యానవనంలో మొక్కల పెంపకాన్ని మరింత పెంచేందుకు ఆలయోద్యోగులు శ్రమదానంలో స్థలాన్ని చదును పరిచారు. అవసరమున్నచోట మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలను ఏర్పరిచారు. ఆహ్లాదాన్ని కలిగించే పచ్చదనం పోషణ కోసం ఆలయోద్యోగులు శ్రమించడం శుభదాయకమని యాడా ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, ఆలయ ఈవో గీత అన్నారు. శ్రమదానంలో ఆలయోద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్‌బాబు, జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఏఈవో రామ్మోహన్‌రావు, చంద్రశేఖర్, వివిధ విభాగాలకు చెందిన పర్యవేక్షకులు, ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మల్లాపురంలో శ్రమదానం చేస్తున్న యాడా ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, ఆలయ ఈవో గీత

ఐఏఎస్ ట్రైనీల సందర్శన



ఆలయోద్యోగులు నిర్వహించిన శ్రమదానం ప్రాంగణంలో ఐఏఎస్ ట్రైనీలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని ఐఏఎస్ ట్రైనీల బృందం బుధవారం సందర్శించింది. బాలాలయంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించి పూజలు చేపట్టారు. ఆలయ విస్తరణ కోసం జరుగుతున్న పనులను ఐఏఎస్ ట్రైనీలు సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 'యాడా' ఉపాధ్యక్షుడు కిషన్‌రావుతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. మల్లాపురంలో ఆలయోద్యోగులు చేపట్టిన శ్రమదానం ప్రాంగణాన్ని సైతం సందర్శించి పలు అంశాలపై ఆలయ అధికారులతో చర్చించారు.

చెర్వుగట్టులో ప్రత్యేక పూజలు

చెర్వుగట్టు(నార్కట్‌పల్లి), న్యూస్‌టుడే: ప్రముఖ క్షేత్రం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ సూపరింటెండెంట్ ఎల్.రమణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో అంజనారెడ్డి సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు స్వామివారి ఆశీస్సులు అందజేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గట్టుపైన, గట్టుకింద మాస్టర్‌ప్లాన్ ప్రకారం మొత్తం 39 పనులకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. అదేవిధంగా భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని తెలిపారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ ఎల్.రమణ

'ఏఎన్‌ఎంలపై వివక్ష తగదు'



దేవరకొండ ఉప డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎం ఉద్యోగ సంఘ నాయకులు

దేవరకొండ, న్యూస్‌టుడే: ఉదయం లేచింది మొదలు.. బరువైన పెట్టెలను చేతిలో పట్టుకొని గ్రామీణ ప్రాంతాలకు పరుగులు తీసే మాపై వైద్య శాఖ వివక్ష చూపుతోందని దేవరకొండ డివిజన్‌లో పనిచేసే ఏఎన్‌ఎంలు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక ఉప డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట వైద్యఆరోగ్యశాఖ విడుదల చేసిన గోడపత్రికలను చేతిలో పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ప్రపంచాన్ని వణికిస్తున్న తట్టు, రూబెల్లా వ్యాధిపై ముద్రించిన ప్రచార గోడపత్రికపై తమను కించపర్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల శిక్షణ, పెద్దగా విద్యార్హత లేని ఆశా కార్యకర్తలను టీకాల ప్రచార గోడపత్రికలో ముందుంచి ఏఎన్‌ఎంలను వెనుక వరుసలో కనబడని ప్రాంతాల్లో ఉండేలా ఫొటోలను ముద్రించడం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఏఎన్‌ఎంల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.అనసూర్య, జిల్లా ఉపాధ్యక్షురాలు కనకదుర్గ, ప్రేమలత, డివిజన్ అధ్యక్షురాలు ఎన్.కౌసల్య, సునీత, వెంకటమ్మ, శారద, విజయ, మమత పాల్గొన్నారు.

మట్టిని వదిలేసి.. మాటలు మార్చేసి

(మొదటి పేజీ తరువాయి) గణేష్‌లు వాడవాడల్లో కొలువుదీరే ప్రణాళిక నూరు శాతం అమలయ్యేది. మొక్కుబడి సమావేశాలు తప్పితే మట్టి గణపతిలపై ప్రచారం చేయాలన్న దిశగా జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపడం లేదన్న ఆరోపణలున్నాయి. గతేడాది జిల్లా అధికార యంత్రాంగం మట్టి గణపతుల వాడకంపై పలు సమావేశాలు నిర్వహించింది. ఈసారి నల్గొండ, యాదాద్రి జిల్లాల్లో ఎక్కడా ఉన్నతాధికారులు మట్టి గణపతుల వాడకంపై సమావేశాలు నిర్వహించకపోవడం గమనార్హం. ఈ రెండు జిల్లాలతో పోలిస్తే సూర్యాపేట జిల్లా యంత్రాంగం చొరవ అభినందనీయమే.

విద్యాశాఖ చొరవ

నల్గొండ పట్టణంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ హరిత దళాల(ఎన్‌జీసీ) విద్యార్థులను మట్టి గణపతుల వాడకం, తయారీపై ఈనెల 21న ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇలా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు తగిన విధంగా ప్రచారం కల్పిస్తే మరింత మెరుగైన ప్రయోజనం ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వినాయకచవితి సందర్భంగా శాంతి సమావేశం నిర్వహించిన ఉన్నతాధికారులు మట్టి గణపతుల వినియోగంపై ప్రచారాన్ని మరిచారన్న విమర్శలున్నాయి. భువనగిరి యాదాద్రి జిల్లాలోనూ పర్యావరణ హిత మట్టి గణపతులపైన ఉన్నతాధికారులు ప్రచారం నిర్వహించలేదు. ఒకవైపు తెలంగాణ సర్కారు పర్యావరణాన్ని, నీటి వనరులను కలుషితం చేసే పీవోపీ విగ్రహాలు వాడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పించాలని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది.

పీసీబీ అధికారులకు బాధ్యత లేదా?

పర్యావరణ పరిరక్షణపైన ప్రచారం చేయాల్సిన కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు ఈ దిశగా చొరవ చూపడం లేదు. మట్టి గణపతుల వాడకంపై గతంలో కరపత్రాలతో పీసీబీ అధికారులు ప్రచారం చేసి పీవోపీ వాడకం వల్ల నీటి వనరులు ఎలా కలుషితం అవుతాయో తెలియజెప్పేవారు. ప్రస్తుతం ఎక్కడా అలాంటి దాఖలాలు లేవు. వారు ప్రజలకు అందుబాటులోనే ఉండరని స్వయంగా జిల్లా ఉన్నతాధికారులే పెదవి విరచడం వారి పనితీరుకు నిదర్శనంగా చెబుతున్నారు. ప్రస్తుతం మూడు జిల్లాల్లో కలిపి దాదాపు 25వేల వరకు విగ్రహాలు ప్రతిష్ఠిస్తారని అధికారుల అంచనా. ఇంట్లో, చిన్న చిన్న వీధుల్లో ప్రతిష్ఠించే విగ్రహాలు వీటికి అదనం. ఇవన్నీ నీటి వనరుల్లో చేరితే అవి తాగడానికి పనికిరాని పరిస్థితి. ముందునుంచి ప్రణాళిక పరంగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో

తిప్పర్తి, న్యూస్‌టుడే: విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతోనే గంగన్నపాలేనికి చెందిన కవుటి జానయ్య మృతిచెందారని ఆరోపిస్తూ అతడి బంధువులు, గ్రామస్థులు బుధవారం అద్దంకి- నార్కట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపై తిప్పర్తిలో మృతదేహంతో రాస్తారోకో చేపట్టారు. జానయ్య(50) మంగళవారం ఇంట్లో తీగపై బట్టలు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. రాస్తారోకో వల్ల వాహనాలు రాకపోకలు స్తంభించాయి. ఎస్సై శివకుమార్ సర్దిచెప్పడంతో రాస్తారోకో విరమించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని విద్యుత్తు అధికారులు హామీ ఇచ్చారు.



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బంధువులు, గ్రామస్థులు

ముచ్చటగా మూడు.. సేవలందేను చూడు

(మొదటి పేజీ తరువాయి) సామగ్రి గోదాముల విభజన జరగకపోవడం గమనార్హం. కొత్త జిల్లాల్లోని యంత్రాంగం ఇప్పటికీ ఉమ్మడి జిల్లా సామగ్రి గోదాములను ఆశ్రయించాల్సి వస్తోంది. ఫలితంగా ప్రజలకు సేవలు అందించడం, సామగ్రి తరలించడంలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. దీంతో పనులు నత్తనడకన నడుస్తున్నాయి.

ఇవీ ఇబ్బందులు

నల్గొండ జిల్లా నుంచి కొత్తగా యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలు ఏర్పడ్డాయి. మూడు జిల్లాల పరిధిలో ఐదు విద్యుత్తు డివిజన్లు, 59 సెక్షన్లు ఉన్నాయి. ఒక్కో సెక్షన్ కింద సుమారు 40 నుంచి 48 గ్రామాలున్నాయి. సంస్థ ఆధ్వర్యంలోని 59 సెక్షన్లకు ఏచిన్న విద్యుత్తు వస్తువు కావాల్సి ఉన్నా నేటికీ ఉమ్మడి జిల్లా కేంద్రం నల్గొండలోని విద్యుత్తు గోదాముకు పరుగెట్టాల్సిందే. ఉన్న ఒక్క గోదామును కొత్త జిల్లాలకు విభజించిన పక్షంలో బాధలు తప్పే అవకాశం ఉంది. కొత్త విద్యుత్తు కనెక్షన్‌కు జారీ చేసే మీటరు, స్తంభాలు, తీగలు, కండెక్టర్లు, నియంత్రికలు, ఎర్త్ వైర్లు, రాడ్‌లు, కాసారాలు, స్టేవైర్‌తో పాటు పలు రకాల సామగ్రిని నేటికీ నల్గొండలోని గోదాము నుంచి తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యుత్తు సామగ్రి కోసం ఉమ్మడి జిల్లా పరిధి నుంచి నిత్యం సుమారు 25 మండలాల వారు నల్గొండకు వస్తుంటారు. తీసుకున్న సామగ్రిని సెక్షన్లకు తీసుకొచ్చేందుకు కనీసం రెండు రోజులు పడుతుంది. దీనికి తోడు రవాణా భారంగా మారుతోంది. కొన్ని సందర్భాల్లో రవాణా ఛార్జీలను వినియోగదారుల నుంచి ఉద్యోగులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అత్యవసర సమయాల్లో సామగ్రి అందక సేవలు నిలిచిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఎంతో వ్యయప్రయాసలతో నల్గొండకు వెళ్లినప్పటికీ అవసరమున్న సామగ్రి గోదాములో లభించడంలేదని, ఒట్టి చేతులతో వెనుదిరగాల్సి వస్తోందని సంస్థ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్గొండకు దగ్గరగా ఉన్న సెక్షన్లలోని ఉద్యోగులు ఎప్పటికప్పుడు తమకు అవసరమున్న సామగ్రిని తీసుకెళ్తుండటంతో.. దూరమున్న సెక్షన్లకు డిమాండ్ మేరకు సామగ్రి లభించడంలేదు.

విభజిస్తే ప్రయోజనం

కొత్త జిల్లాల్లో విద్యుత్తు సామగ్రి గోదామును ఏర్పాటుచేసిన పక్షంలో సంస్థ ఉద్యోగులు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. గోదాము ఏర్పాటుతో కొత్త పోస్టులు మంజూరయ్యే అవకాశం ఉంది. స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశమూ ఉంది. ప్రస్తుతం నల్గొండ గోదాములో ఏడీఈ, ఏఈతో పాటు సబ్ ఇంజినీరు, ఇద్దరు ఎల్‌డీసీలు, ఐదుగురు కార్మికులు, 15 మంది రోజువారి కార్మికులకు పనిచేస్తున్నారు. కొత్తగా ఆయా జిల్లాలో గోదాము ఏర్పాటుచేస్తే ఇదే రీతిలో అక్కడ సిబ్బందిని నియమించవచ్చు. ఫలితంగా పలువురికి ఉపాధి అందే అవకాశముంది. నల్గొండ నుంచి సామగ్రి తరలించే భారం కూడా తగ్గుతుంది. క్షేత్రస్థాయిలో పనులు త్వరితగతిన జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను గుర్తించి గోదామును విభజించి వినియోగదారులకు సత్వరం సేవలు అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

దత్తాత్రేయకు వినతి పత్రం అందజేత

ముంబయి, న్యూస్‌టుడే: ముంబయిలోని లోకమాన్య తిలక్ టెర్మినస్ (ఎల్‌టీటీ) నుంచి కాకినాడ పోర్ట్‌కు తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా మీదుగా నడుస్తున్న(వారాంతపు రైళ్లను) రైళ్లను రామన్నపేట, చిట్యాల రైల్వే స్టేషన్‌లలో ఒకచోట ఆగేలా(స్టాప్ ఉండేలా) చొరవ చూపాలని ఉమ్మడి నల్గొండ జిల్లావాసుల ఐక్యవేదిక మహారాష్ట్ర అధ్యక్షుడు కమ్మమెట్టు దశరథ్, కేంద్ర కార్మికశాఖ సహాయ మంత్రి(స్వతంత్ర హోదా) బండారు దత్తాత్రేయకు వినతి పత్రం అందజేశారు. ముంబయి, ఉపనగరాలు, ఠానే, భివండీ, పుణె తదితర ప్రాంతాల్లో నివాసముంటున్న ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన వేలాది కుటుంబాలు స్వగ్రామానికి రాకపోకలు సాగించేందుకు గతంలో సూర్యాపేట, నార్కట్‌పెల్లి డిపోలకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండేవి. కొన్నాళ్ల క్రితం ఈ బస్సులను కూడా అధికారులు పూర్తిగా నిలిపివేశారు. దీంతో 17221, 17222 నంబరు గల(వారాంతపు రైళ్లు)రైళ్లు వారంలో ప్రతి బుధవారం, శనివారం, గురువారం, ఆదివారం తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా మీదుగా నడుస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతం ప్రజలు(లోక్‌మాన్య తిలక్ టెర్మినస్, కాకినాడ పోర్ట్) వారాంతపు రైళ్లలలోనే రాకపోకలు సాగిస్తున్నారు. సదరు రైళ్లు లోక్‌మాన్య తిలక్ టెర్మినస్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లిన తర్వాత నేరుగా నల్గొండ రైల్వే స్టేషన్‌లో ఒక్కచోట మాత్రమే రెండు నిమిషాలు ఆగుతున్నాయి. ఈ కారణంగా మధ్య ప్రాంతాల్లో దిగవల్సిన ప్రయాణికులు సికింద్రాబాద్, నల్గొండ స్టేషన్లలోనే దిగాల్సి వస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఏ గ్రామం వెళ్లాలన్నా నల్గొండ రైల్వే స్టేషన్లలో దిగి అక్కడ్నుంచి ప్రైవేటు వాహనాలు ఆశ్రయించి వెళ్లాల్సిందే. సుమారు 50-60 కి.మీల మేర వృథాగా ప్రయాణించవలసి వస్తోంది. పరిసర ప్రాంతాల్లో ఒక స్టాపులో ఆపితే ఇబ్బందులు తగ్గుతాయనే ఉద్దేశ్యంతోనే ఈ విషయాన్ని వినతి పత్రం ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఐక్యవేదిక అధ్యక్షుడు కమ్మమెట్టు దశరథ్ పేర్కొన్నారు. రైళ్లను రామన్నపేట, చిట్యాల రైల్వే స్టేషన్లలో ఒకచోట కనీసం ఓ రెండు నిమిషాలైనా నిలిపేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశామని దశరథ్ వెల్లడించారు. వినతి పత్రం స్వీకరించిన మంత్రి దత్తాంత్రేయ పూర్తి వివరాలు పరిశీలించి సమస్య పరిష్కారం దిశగా ప్రయత్నిస్తానని చెప్పినట్లు ఆయన తెలిపారు.



వినతిపత్రం అందిస్తున్న కమ్మమెట్టు దశరథ్ తదితరులు

తెరముందు యంత్రాంగం.. తెరవెనుక మంత్రాంగం

(మొదటి పేజీ తరువాయి) 16 ఎకరాలలో పత్తి పంట వేశారు. ఈ విషయమై రెండేళ్ల నుంచి స్థానిక రెవెన్యూ అధికారులు ఆ భూమిలో పంటలు సాగు చేసుకోవద్దని సదరు రైతుల్ని హెచ్చరించినా వారు వినడం లేదని అధికారులు 'ఈనాడు'కు వెల్లడించడం విశేషం. ఈ భూమిని మామిళ్లగూడెంకు సంబంధించిన కొందరు రైతులు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. ఈ భూమి అన్యాక్రాంతం అవుతుండడంపై నాలుగేళ్ల కిందట కొందరు అధికారులను ప్రశ్నించగా వారు రెవెన్యూ దస్త్రాలను పరిశీలించి ఈ భూమి ఫక్రుద్దిన్, పీర్లమాన్యం పేరుతో ఉందని గ్రామస్థులకు వెల్లడించారు. తీరా అన్ని వివరాలు సేకరించగా... సదరు ఫక్రుద్దిన్‌కు ఈ భూమికి ఎలాంటి సంబంధం లేదని తేటతెల్లమైంది. గుండ్లపల్లి పక్కనే ఉన్న మామిళ్లగూడెం గ్రామం నల్గొండ పురపాలికలో ఉంది. పురపాలికలో ఎకరా దాదాపు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన ఈ భూమి ధర దాదాపు రూ.ఐదు నుంచి రూ.ఆరు కోట్ల విలువ చేస్తుంది. ఈ భూమి అన్యాక్రాంతమైన విషయం సదరు రెవెన్యూ ఉన్నతాధికారులకు తెలిసినా వారు ఈ విషయంపై స్పందించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయితే దీని వెనక కొందరు పెద్దల హస్తం ఉందనే వాదనలూ ఉన్నాయి. అందువల్లే రెవెన్యూ అధికారులు ఈ భూమి విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఈ భూమిలో సాగుచేసుకుంటున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పండ్ల మార్కెట్ పరిశీలన

తెలంగాణ సర్కారు నల్గొండ జిల్లా కేంద్రంలో బత్తాయి పండ్ల మార్కెట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి స్థలం కొరత ఏర్పడటంతో నల్గొండ జిల్లా కేంద్రం చుట్టుపక్కల ఉన్న పలు ప్రభుత్వ స్థలాలను గతంలో అధికారులు పరిశీలించారు. ఈ 16.21 ఎకరాల భూమిని కూడా పరిశీలించినా ఇతర స్థలాలతో పోలిస్తే పట్టణానికి దూరమవడంతోపాటు భారమయ్యే అవకాశం ఉందని గ్రహించి దీనిని పరిగణలోకి తీసుకోలేదు. అప్పుడు ప్రభుత్వ భూమిగా పండ్ల మార్కెట్‌కు పరిగణలోకి తీసుకున్న అధికారులు... ఇప్పుడు అది ప్రభుత్వ భూమి అని చెప్పడానికి తగినన్నీ ఆధారాలు రెవెన్యూ గెజిట్లో లేవని చెప్పడం గమనార్హం.

చర్యలు తీసుకుంటాం

ఈ భూమిపై త్వరలోనే సమగ్ర సర్వే చేపడతాం. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారెవరైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– సి.నారాయణరెడ్డి, సంయుక్త కలెక్టరు(జేసీ), నల్గొండ.

జనపనార ఉత్పత్తులు



తయారు చేసిన జనపనార సంచులు

“ఆర్థికంగా వెనుకబడి ఉన్న పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర చేనేత మంత్రిత్వ శాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆలివ్ సంస్థ చేయూత ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత జనపనార ఉత్పత్తుల శిక్షణ శిబిరం సత్ఫలితాలనిస్తున్నాయి. ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత కృషి ఫలితంగా గతంలో యాదగిరిగుట్టలోని స్త్రీ శక్తి భవనంలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిక్షణ శిబిరం ద్వారా పేద మహిళలు శిక్షణ పొంది స్వయం ఉపాధికి మార్గం వేసుకున్నారు. వీరికి ప్రభుత్వం ద్వారా ఆర్థిక ప్రోత్సాహం అందకున్నా సొంత ఖర్చులతో జనపనారతో వస్తువుల తయారీ చేపడుతూ, నేర్చుకున్న విద్యతో పాటు నైపుణ్యతకు పదును పెడుతూ స్వయం ఉపాధికి నిచ్చెన వేసుకున్నారు.”

- యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే

శిక్షణ పొందిన కొందరు మహిళలు కలిసి శ్రీ యాదాద్రి జ్యూట్ బ్యాగ్స్ హోల్‌సెల్, రిటైల్ పేరిట దుకాణాన్ని సొంత పెట్టుబడులతో యాదగిరి గుట్ట పట్టణంలో ప్రారంభించారు. క్యారియర్, కార్యాలయ, లంచ్ బ్యాగులు, లాప్ టాప్ బ్యాగులు, పుస్తకాల బ్యాగులు, టూర్ బ్యాగులు, పౌచ్‌లు, హ్యాడ్ పర్సులు ఒక టేమిటీ పలు రకాల వస్తువులను తయారు చేస్తూ రాణిస్తున్నారు. రూ.30 నుంచి 300 వరకు ధరలను నిర్ణయించారు. ప్రస్తుతం ప్రజలు అధునాతన, ఆకర్షణీయమైన సంచులపై ఆసక్తి చూపుతున్నారు. విభిన్న ఆకృతులపై మక్కువ కనబరుస్తున్నారు. వారికి నచ్చిన వాటి కోసం ఎంత ధర చెల్లించేందుకైనా వెనుకాడటం లేదు. ఈ నేపథ్యంలో నేర్చుకున్న శిక్షణతో పాటు మరిన్ని మెలకువలు నేర్చుకుంటూ బ్యాగుల తయారీ ద్వారా మహిళలు స్వయం ఉపాధికి మార్గాలు వేసుకున్నారు. జిల్లా, మండల కేంద్రాలలో ఆర్డర్‌లు సాధించుకుంటూ నెలకు ఖర్చులు పోనూ రూ. 6 వేలు సంపాదిస్తు తమ కాళ్లపై తాము నిలబడేలా చేసుకుంటున్నారు. అయితే వ్యాపార వృద్ధి అవకాశంతో పాటు మరికొందరు సిబ్బందిని ఏర్పాటు చేసుకొని వ్యాపార విస్తరణ చేసుకొనే అవకాశం ఉన్నప్పటికీ ప్రోత్సాహం కరవై ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల ద్వారా రుణ సహాయం చేస్తే వ్యాపార విస్తరణతో పాటు, మరికొం దరు మహిళలకు శిక్షణలు కల్పించి ఉపాధి చూపెట్టగలమన్న ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు

ఆకట్టుకునేలా బ్యాగులను తయారు చేస్తున్నాం: భార్గవి



ఈ రోజుల్లో ఎంత చదివినా ఉద్యోగాలు రాని పరిస్థితి ఉంది. దీంతో స్వయం ఉపాధిని సాధించేందుకు శిక్షణ పొంది, ఈ వ్యాపారం పై దృష్టి సారించా. ప్రస్తుతం కొత్త ఆకృతులతో కూడిన బ్యాగులపై అందరూ ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. దీంతో డిమాండ్ పెరుగుతోంది. ఆకట్టుకునేలా బ్యాగులు తయారు చేసేవారికి మార్కెట్లో ఆదరణ ఉంటుంది. అందుకే నైపుణ్యత మరింత మెరుగులు దిద్దుకుంటూ బ్యాగులు తయారు చేస్తూ, ఆర్థికంగా స్థిరపడుతుండడం సంతోషంగా ఉంది.



సంచుల కొనుగోలుదారులతో చర్చిస్తూ..

ప్రభుత్వం సాయమందించాలి: సుష్మ



జనపనార కుట్టు శిక్షణ మాకు ఎంతగానో ఉపకరించింది. ఇంటి వద్ద ఖాళీగా కూర్చునే మాకు మంచి ఉపాధి మార్గం లభించింది. అయితే వ్యాపారం బాగా సాగుతున్నా, ఆర్థికంగా వెనుకబడిన ఉన్న కుటుంబాలకు చెందిన వారం కావడంతో వ్యాపార వృద్ధి చేసుకోలేకపోతున్నాం. గతంలో బ్యాంకు రుణాలు కల్పిస్తామని, ఉచితంగా యాదాద్రి కొండపై స్టాల్ కల్పిస్తామని చెప్పినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపితే మరికొందరికి ఉపాధి చూపినవారు అవుతారు.

వ్యాపారం బాగా సాగుతుంది: తిరుమల



ప్రస్తుతం నలుగురం మహిళలం కలిసి జనపనారతో బ్యాగులు తయారు చేస్తూ అమ్మకాలు చేపడుతూ స్వయం ఉపాధి పొందుతున్నాం. మేము తయారు చేసే బ్యాగులకు మంచి ఆదరణ ఉండడంతో నోటి ప్రచారంతోనే చాల చోట్ల నుంచి ఆర్డర్స్ వస్తున్నాయి. అయితే కుట్టుమిషన్‌తో పాటు అధునాతన మిషన్‌ల అవసరం, మరికొందరు సిబ్బంది అవసరం ఉంది. స్వంత పెట్టుబడులు కావడంతో త్వరగా వృద్ధి సాధ్యం కావడం లేదు. ప్రభుత్వం సాయం అందిస్తే ఇక్కడ పెద్ద స్థాయిలో బ్యాగుల ఉత్పత్తి, శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని ఉంది.

బ్యాగులు బాగున్నాయి: జ్యోతి, కొనుగోలుదారురాలు



శిక్షణ పొందిన మహిళలు తయారు చేసిన వివిధ రకాల బ్యాగులు ఆకట్టుకుంటున్నాయి. కార్యాలయ బ్యాగులు, పౌచ్‌లు ఇదివరకే కొనుకోలు చేశాను. మా పిల్లలు కూడ తమకు కూడ బ్యాగులు కావాలని కోరడంతో మళ్లీ ఇక్కడికి వచ్చాను. ముఖ్యంగా స్వయం ఉపాధి మార్గాలు వేసుకున్న ఈ మహిళలకు ప్రోత్సాహం అందించాలని కూడా. అయితే దుకాణం మారు మూల కాకుండా జనం రద్దీగా తిరిగే ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే ఈ చేతి వృత్తి పనులకు మరింత ఆదరణ లభిస్తుంది.

విశ్రాంత ఉపాధ్యాయుని అవిశ్రాంత సేవలు

సామాజిక సేవలకు ‘తెలంగాణ రత్న’, ‘సామాజిక సేవా రత్నా’ పురస్కారాలు



తాను అందుకున్న జ్ఞాపికలతో భాస్కరాచారి

“ఉపాధ్యాయ వృత్తిలో, విద్యాబోధనలో, విద్యార్థులను తీర్చిదిద్దంటంలో ఉత్తమ ఉపాధ్యాయునిగా మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డులందుకున్న ఈయన ఉద్యోగ విరమణ చేసిన అనంతరం సామాజిక సేవలందిస్తున్నాడు. అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థల్లో భాగస్వామ్యం వహిస్తూ సమాజహితం కోసం పనిచేస్తున్నాడు మోత్కూరుకు చెందిన సూరోజు భాస్కరాచారి.”

మోత్కూరు,న్యూస్‌టుడే

తన సేవలను గుర్తించిన స్వచ్ఛంద సేవా సంస్థలు భాస్కరాచారికి రాష్ట్ర స్థాయిలో ‘సామాజిక సేవా రత్న’, ‘తెలంగాణ రత్న’ పురస్కారాలను ప్రదానం చేశాయి. పలు సంస్థలు పలు పురస్కారాలతో సన్మానించాయి. మోత్కూరు ప్రాంతంలో ఎంతో పేరెన్నిక గల గురుశ్రేణి విశిష్టులు, స్వాతంత్ర్య సమరయోదుడు, దివంగత సూరోజు తిరుపతయ్య కుమారుడైన భాస్కరాచారి 30 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ప్రధానోపాధ్యాయునిగా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది మోత్కూరు మండల స్థాయిలో పలుమార్లు, ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డులందుకున్నారు. మోత్కూరు ఎంఎల్‌వోగా బాలకార్మిక వికాస కేంద్రం నిర్వహకునిగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం, వయోజనుల్లో అక్షరాస్యతను పెంచేందుకు కృషి చేసి జిల్లా పాలనాధికారి ప్రసంశలందుకున్నారు. జనవిజ్ఞాన వేదిక డివిజన్ అధ్యక్షునిగా పలు ప్రజాచైతన్య, సామాజిక రుగ్మతుల మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో మూఢనమ్మకాలు తొలగించేందుకు, సైన్స్‌పై అవగాహన పెంచే కార్యక్రమాలను చేపట్టారు.



విశాఖలో అర్పిత సేవా సంస్థ వారు భాస్కరాచారికి అందిస్తున్న స్టేట్ డైమండ్ సిటిజన్ అవార్డు

పలు పురస్కారాలు

- 2012లో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా జిల్లా కలెక్టర్ ముక్తేశ్వర్‌రావు చేతులమీదుగా అవార్డును అందుకున్నారు.
- 2014లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కల్చరల్ ఆవేర్‌నెస్ సొసైటీ విశాఖపట్నం వారు తెలంగాణ రత్న అవార్డును ప్రదానం చేశారు.
- అర్పిత సాహితీ సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ విశాఖ పట్టణం వారిచే 2015లో ‘స్టేట్ డైమండ్ సిటిజన్’ అవార్డును,
- 2016లో స్టేట్ బెస్ట్ సిటిజన్ అవార్డును అందజేస్తింది.
- 2016లో భాస్కరాచారి సేవలను గుర్తించిన విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా శాఖ విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీష్‌రెడ్డి చేతులమీదుగా సామాజిక సేవారత్న అవార్డును అందజేసింది.
- భాస్కరాచారి సేవలను గుర్తించిన పలు స్వచ్ఛంద సంస్థలు పలుమార్లు సన్మానించాయి.



దాచారంలో విద్యార్థులకు అభ్యసన సామగ్రి అందజేసిన సందర్భంగా...

ఐదేళ్లుగా విద్యార్థులకు అభ్యసన సామగ్రి

భాస్కరాచారి తల్లిదండ్రులు సూరోజు తిరుపతయ్య, కమలమ్మ, కొడుకు రవి కుమార్ స్మారకార్థం అండెం దయాకర్‌రెడ్డి తోడ్పాటుతో దాచారం, బుజిలాపురం పాఠశాలల్లో అయిదో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఐదేళ్లుగా స్టడీమెటీరియల్, మరికొందరి విద్యార్థులకు రాతపుస్తకాలు, బ్యాగులు, బూట్లు, స్టీల్‌ప్లేట్లు, బ్యాడ్జీలు అందజేస్తున్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ, ప్రజాభారతి ఆధ్వర్యంలో ఐదేళ్లుగా ఆర్టీసీ బస్టాండ్‌లో, అంబేడ్కర్ చౌరస్తా వద్ద తన సొంత ఖర్చుతో ప్రయాణికుల కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చుతున్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధిగా, ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ మోత్కూరు శాఖ కోశాధికారిగా ఉచిత వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాలలో, పొగాకు వ్యతిరేక కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలనే వాడాలని, హరితహారంలో మొక్కలు నాటడం, విద్యార్థి వికాస సదస్సులు తదితర కార్యక్రమాలలో భాగస్వామ్యం వహిస్తున్నారు. స్థానిక ప్రజాభారతి సాహితీ సంస్థలో ప్రతినిధిగా సాహిత్య కార్యక్రమాల నిర్వహణలో పలుపంచుకుంటున్నారు.

సమాజానికి ఉపయోగపడాలి...

–సూరోజు భాస్కరాచారి

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు సమాజానికి ఉపయోగపడాలనే ఉద్దేశంతోనే సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యం వహిస్తున్నారు. పేదలకు సేవలందించడంలో ఉన్న తృప్తి మరేందులోనూ లేదు. నాలాగా ఉద్యోగవిరమణ చేసినవారంతా సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యం వహించాలన్నదే నా అభిలాష.

స్టాండ్ తీయకపోతే మోతే..

★ బైక్ ప్రమాదాలు నివారించే పరికరం తయారు ★ గ్రామీణ యువకుని ప్రతిభ


కార్లలో సీటు బెల్ట్ పెట్టుకోకపోతే చెప్పే పరికరం లాంటిదే ఈ పరికరం. ఇది సైకిల్‌మోటార్(బైక్) సైడ్‌స్టాండ్ తీయకపోతే చెబుతుంది. సైడ్ స్టాండ్ తీయకుండానే ప్రయాణించడం వల్ల ముఖ్యంగా మూలమలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఈ నూతన ఆవిష్కరణ ప్రాధాన్యం సంతరించుకుంది. మోత్కూరుకు చెందిన ఎడ్ల రాము.



బైక్‌కు సీసాలో అమర్చిన పరికరం

మోత్కూరు, న్యూస్‌టుడే

ఈ పరికరాన్ని తయారు చేశాడు. సెల్‌ఫోన్ దుకాణాన్ని నడుపుకునే రాము తనకున్న పరిజ్ఞానంతో సైకిల్ మోటార్ నుంచి వెలువడే పన్నెండు ఓల్ట్‌ల విద్యుత్తును మూడు ఓల్ట్‌లకు తగ్గిస్తూ డ్రాప్‌సర్క్యూట్‌ను, ఆడియో సర్క్యూట్, మెమరీకార్డ్, బైక్ బ్రేక్‌లైట్ స్విచ్, ఒక స్పీకర్‌ను ఉపయోగించి ఈ పరికరాన్ని తయారు చేసినట్లు ‘న్యూస్‌టుడే’కు తెలిపారు. మెమరీకార్డులో మనకు కావాల్సిన విధంగా వాయిస్‌రికార్డు చేసి ఉంచడం వల్ల బైక్ స్టాండ్ తీయకుండానే వెళ్లే ముందు ఈ పరికరం స్టాండ్ తీయలేదని శబ్దం చేస్తుందని తెలిపారు. స్వల్ప ఖర్చుతో తయారయ్యే ఈ పరికరాన్ని సైకిల్‌మోటార్‌కు ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త పడవచ్చునని ఆయన వివరించారు.



బైక్‌తో ఎడ్ల రాము

పెరటి సాగు... ఆసక్తి బాగు

జయమ్మ ఇంట్లో సాగవుతున్న కూరగాయలు



పీఏపల్లి పునరావాస కేంద్రంలో ఆదర్శంగా పెరటిసాగు

ఇంటి ఖర్చులు పోను కొంత ఆదాచేసుకుంటున్న స్థానికులు

శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో సాగవుతున్న బెండ



ఖర్చులు తగ్గించుకునేందుకే: ధర్మాపురం జయమ్మ, పీఏపల్లి

ఇటీవల కాలంలో కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ఏ కూరగాయలు కూడా కొనలేని పరిస్థితి నెలకొంది. ఈ ఖర్చుతగ్గించుకునేందుకు మాకు అందుబాటులో ఉన్న ఇంటి ఆవరణను వినియోగించి కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాం. మాకు సరిపోను వినియోగించి, మిగిలిన వాటిని విక్రయిస్తున్నాం.

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే: ఏఎమ్మార్ ప్రాజెక్టు ముంపు గ్రామం పీఏపల్లి నిర్వాసితులు విస్తృతంగా పెరటి సాగు చేపడుతున్నారు. ఏ ఇంట్లో చూసినా ఏదో ఒక కూరగాయ సాగు దర్శనమిస్తోంది. ముఖ్యంగా ఇటీవల రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్న కూరగాయాల ధరలతో ఎంతోకొంత ఖర్చును తగ్గించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న పెరటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇటీవల ప్రారంభమైన ఖరీఫ్ వర్షాలకు అనుగుణంగా ఇంటింటా కూరగాయలు పండించి ఇంటి బడ్జెట్‌లో కొంత ఆదా చేస్తున్నారు. దీంతో పాటు ఇరుగుపొరుగువారి స్వచ్ఛమైన కూరగాయలు అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కూరగాయలతో పాటు ఆకుకూరలు కూడా పండిస్తున్నారు. ఇటీవల ధరలు పెరిగిన మిరప, టమాటా, బెండలను సాగు చేసేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. వీటి ధరలు నూటికి సమీపించడంతో కొనలేక తీవ్రంగా ఇబ్బందులు పడిన స్థానికులు ఈ దిశగా దృష్టిసారించారు. కూరగాయలకు పందిర్లు వేసి తీగ జాతి పొట్ల, చిక్కుడు, బీర, కాకర, సొరలతో పాటు బెండ, గోకర, వంకాయ, టమాట, మునగలతో పాటు పలు రకాలు పండిస్తున్నారు. ఆకు కూరలలో పాలకూర, చుక్కకూర, గోంగూర, మెంతికూర, తోటకూర, కొత్తిమీర, పూదీనలు వేస్తున్నారు. మరి కొందరు ఖాళీ ప్లాట్లను వృథాచేయకుండా మొత్తం పందిర్లు వేసి ఈ ప్రాంత ఆదర్శసాగు దొండను సాగుచేస్తున్నారు. గ్రామంలో సుమారు ముప్పై శాతం ఇండ్లలో పెరటిసాగు కనిపిస్తుంటుంది. ప్రహరీ లేనివారు చుట్టూ ముళ్లకంపను ఏర్పాటుచేసి రక్షణ ఏర్పాటు చేసుకుంటున్నారు.



యల్లయ్య ఆవరణలో సాగవుతున్న మిరప

అందుబాటులోని వనరులు వినియోగించుకుంటున్నా : పేర్ల యల్లయ్య, పీఏపల్లి

నాకు మా ఇంటి పరిసరాల్లో అందుబాటులో ఉన్న వనరులు సద్వినియోగం చేసుకుని కూరగాయలు పండిస్తున్నాం. గత రెండుమూడేళ్లుగా కాలానుకనుగుణంగా విరివిగా కూరగాయలు పడిస్తున్నాను. మంచి దిగుబడులు వస్తున్నాయి. ఇటీవల మా ఖాళీ ప్లాటులో పందిరివేసి దొండసాగు చేస్తున్నాను. ప్రతినిత్యం తెల్లవారుజామున గ్రామంలో తిరిగి పండించిన కూరగాయలు విక్రయిస్తూ ఆర్థికంగా వెసులుబాటు పొందుతున్నాను.

అవసరాలు తీరుతున్నాయి..

ఎ.శ్రీనివాస్‌రెడ్డి, పీఏపల్లి



మేం పీఏపల్లి పాత గ్రామం నుంచి నూతన గ్రామానికి వచ్చినప్పటి నుంచి స్థలం వెసులుబాటు ఉండటంతో మా ఇంటి ఆవరణలో ప్రతిసారి కూరగాయలు సాగుచేస్తున్నాం. ఇంటి కూరగాయల అవసరాలు తీర్చుకుంటున్నాం. ముఖ్యంగా రసాయనిక ఎరువులకు దూరంగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేపడతాం. ఇటీవల విపరీతంగా పెరిగిన ధరలతో మా పరిసరాల్లో ప్రతి ఒక్కరూ ఈ సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

సేంద్రియ ఎరువులతోనే సాగు

ముఖ్యంగా గ్రామంలో సాగయ్యే కూరగాయల సాగు సేంద్రియ పద్ధతులతో చేపడతారు. రసాయనిక ముందులు వినియోగించరు. ఖర్చుతో కూడుకున్న రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా పశువుల పేడను వినియోగిస్తుంటారు. కొందరు మహిళలు ఇంట్లో పండిన కూరగాయలు, ఆకు కూరలను తెల్లవారు జామున గ్రామంలోని వీధులలో తిరిగి విక్రయిస్తుంటారు. రసాయనిక ఎరువులకు దూరంగా పండించడంతో మంచి పోషకాలుంటాయన్న యోచనతో ఈ కూరగాయలు, ఆకు కూరలను స్థానికులు ఆసక్తిగా కొనుగోలు చేస్తుంటారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం: భిక్షమయ్య గౌడ్

ఆత్మకూర్(ఎం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేస్తుందని ఉమ్మడి నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. బుధవారం ఆత్మకూరు(ఎం)లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఆర్బాటాల ప్రచారాల కోసం రూ. కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఎందుకు ఇవ్వడంలేదని ఆయన ప్రశ్నించారు. 2013 మార్చిలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ బహుదూర్ వెంకటరామిరెడ్డి పేరుతో పోలీస్ అకాడమీని ఏర్పాటు చేసిందని, కానీ సీఎం కేసీఆర్ కులాల ఓట్ల కోసం తానే చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఆర్టీసీలో 3950 పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించిన కేసీఆర్ ఒక్క ఉద్యోగానికి కూడా ఉత్తర్వు జారీ చేయలేదని ఎద్దేవచేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాస లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు దీగోజు నర్సింహచారి, నాయకులు ఎం.సిద్దులు, కె.అనంతరెడ్డి, కె. హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భిక్షమయ్యగౌడ్

భువనగిరిలో చోరీ

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో బుధవారం ఓ ఇంట్లో 3 తులాల బంగారం చోరీకి గురైన ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం ఇందిరానగర్ కాలనీకి చెందిన గాయపాక లక్ష్మమ్మ తన ఇంటి ప్రక్కన ఉన్న దుకాణానికి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి ఇంటిలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అనుమానం వచ్చి పెట్టెలో ఉన్న బంగారం చూడగా కనిపించలేదు. 3 తులాల బంగారంలో నల్లపూసల తాడు, చెవి కమ్మలు చోరికి గురైనట్లు బాధితురాలు తెలిపింది. పోలీసు స్టేషన్‌లో బాధితురాలు ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సాగర్ సమాచారం



నాగార్జునసాగర్, న్యూస్‌టుడే

సాగర్ జలాశయ నీటిమట్టం:	500.20 అడుగులు
ఎడమకాల్వ ద్వారా నీటివిడుదల:	నిల్
కుడి కాల్వద్వారా నీటి విడుదల:	నిల్
ప్రధాన విద్యుత్ కేంద్రం ద్వారా నీటి విడుదల:	నిల్
సాగర్ జలాశయానికి నీటిరాక:	608 క్యూసెక్కులు
శ్రీశైలం జలాశయ నీటిమట్టం:	782.30 అడుగులు
శైలం జలాశయానికి నీటిరాక :	నిల్
ఎస్ఎల్బీసీ ద్వారా నీటివిడుదల :	382 క్యూసెక్కులు
సాగర్ జలాశయం నుంచి పూర్తి నీటి విడుదల	608 క్యూసెక్కులు

వారం దాటితే కష్టమ్..!



- మిల్లర్లు ఇవ్వాల్సిన బియ్యం 47 వేల మెట్రిక్ టన్నులు
- 20 మంది మాత్రమే వంద శాతం అప్పగింత
- గడువు దాటితే మిల్లర్లపై చర్యలకు అధికారులు సన్నద్ధం

నల్గొండ (కలెక్టరేట్), న్యూస్‌టుడే:

కస్టమ్ మిల్లింగ్ బియ్యం సేకరణలో మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణలో నల్గొండ జిల్లా ముందంజలో ఉన్నప్పటికీ ఇంకా 47 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించాల్సి ఉంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని బియ్యం సేకరణకు పౌరసరఫరాల శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. జాప్యం చేస్తూ అక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్న మిల్లర్లపై ప్రత్యేక దృష్టి సారించింది.

వారం రోజులే గడువు

కస్టమ్ మిల్లింగ్ కోసం ధాన్యం తీసుకున్న మిల్లర్లు బియ్యాన్ని పూర్తి స్థాయిలో ప్రభుత్వానికి అందజేసేందుకు ఇక వారం రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. ధాన్యం పొందిన 68 మంది మిల్లర్లకుగాను ఇప్పటి వరకు 20 మంది మాత్రమే పూర్తి స్థాయిలో బియ్యాన్ని అప్పగించారు. ఇంకా 48 మంది మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని అందజేయాల్సి ఉంది. ఈ నెల 31 వరకు మిల్లర్లు అందరూ పూర్తి స్థాయిలో బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. గడువులోపు కస్టమ్ మిల్లింగ్ బియ్యం అందజేయని మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఆయా మిల్లర్లకు ముందస్తు సమాచారమిచ్చారు.

ఇంకా 20 శాతం బియ్యం రావాలి

జిల్లాలో 2016-17 రబీ సీజన్‌లో ప్రభుత్వం ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా 3,33,800 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కస్టమ్ మిల్లింగ్ కోసం జిల్లా వ్యాప్తంగా 68 రైస్ మిల్లులకు పౌరసరఫరాల శాఖ అధికారులు ధాన్యం ఇచ్చారు. అందుకుగాను మిల్లర్ల నుంచి 2.27 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి రావాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు 1.80 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు అందజేశారు. ఇంకా 47 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది.

యేటా ఇదే తంతు

గడువుల మీద గడువులు విధిస్తూ మిల్లర్ల నుంచి కస్టమ్ మిల్లింగ్ బియ్యం సేకరించడం, చివరికి కేసులు నమోదు చేయడం యేటా సాగుతున్న తంతు. వాస్తవానికి సెప్టెంబర్ నెలాఖరు నాటికి కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని ప్రబుత్వం పూర్తి స్థాయిలో సేకరించాల్సి ఉంది. కానీ గడువు పెంచుతారనే ధీమాతో మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ బియ్యంతో దర్జాగా వ్యాపారం సాగిస్తూ ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం ఇవ్వడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మిల్లర్ల అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేసి నిర్ణయించిన గడువులోగా బియ్యం సేకరించేందుకు పౌరసరఫరాల శాఖ ఈనెల చివరి వరకు మాత్రమే గడువు విధించింది. గడువులోపు బియ్యం ఇయ్యని మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు అధికారులు అస్త్రాలు సిద్ధం చేస్తున్నారు.

నెలాఖరులోగా నూరు శాతం ఇవ్వాల్సిందే..: ఉదయ్‌కుమార్, డీఎస్‌వో

కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని మిల్లర్లు ఈ నెలఖరులోగా నూరు శాతం ఇవ్వాల్సిందే. గడువును పెంచే ప్రసక్తే లేదు. గడువులోపు బియ్యం ఇయ్యని మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తప్పవు. ఇప్పటికే మిల్లర్లలతో ప్రతిరోజూ చర్చిస్తున్నాం. బియ్యాన్ని సకాలంలో సేకరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

మట్టి ప్రతిమలతో పర్యావరణానికి మేలు


నీలగిరి, న్యూస్‌టుడే: మట్టి ప్రతిమల వినియోగంతో పర్యావరణానికి మేలు జరుగుతుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని పెద్దగడియారం చౌరస్తాలో గణేష్ నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భక్తులకు మట్టిగణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. పారిశుద్ధ్యం, వీధి దీపాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. విగ్రహాల ఊరేగింపు సందర్భంగా ప్రధాన మార్గాలలో గుంతలు లేకుండా చూస్తామని తెలిపారు. భాజపా జిల్లా అధ్యక్షుడు నూకల నర్సింహారెడ్డి, ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు ప్రసాద్, బొజ్జ శేఖర్, కోశాధికారి అభిలాష్, సభ్యులు వీరెల్లి చంద్రశేఖర్, పల్లెబోయిన శ్యాంసుందర్, పుల్లారావు, బొడ్డుపల్లి శ్రీనివాస్, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, కిన్నెర శ్రీనివాస్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలు పంపిణి చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మి, భాజపా జిల్లా అధ్యక్షుడు నూకల నర్సింహారెడ్డి తదితరులు

చిట్యాల మీదుగా వెళ్లే రైళ్ల రాకపోకల వివరాలు

చిట్యాల, న్యూస్‌టుడే:



రైలు నంబరు	రైలు పేరు	బయలుదేరు సమయం
సికింద్రాబాద్ (చిట్యాల)నుంచి గుంటూరు వైపు		
12748	పల్నాడు ఎక్స్‌ప్రెస్	16.31.
12734	నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్	19.23.
57620	రేపల్లె ఫాస్ట్ ప్యాసింజం	22.49.
77674	డెమో	11.15. (ఆదివారం ఉండదు)
57651	రేపల్లె ప్యాసింజర్	12.52
77675	డెమో	21.27. (గురువారం ఉండదు)
గుంటూరు (చిట్యాల) నుంచి సికింద్రాబాద్ వైపు		
12733	నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్	04.25
12747	పల్నాడు ఎక్స్‌ప్రెస్	00.51
77678	డెమో	06.42 (శుక్రవారం ఉండదు)
57652	రేపల్లె ప్యాసింజర్	13.50.
77673	డెమో	18.06 (ఆదివారం ఉండదు)

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: సమాజంలో విస్తరిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని నల్గొండ ట్రాఫిక్ సీఐ ఆదిరెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం నీలగిరి డిగ్రీ కళాశాలలో ఎంజీయూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛ పక్వాడా ముగింపు సందర్భంగా 'డ్రగ్స్ వినియోగం- అనర్థాలు' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు పౌర సమాజం, ప్రభుత్వ రంగాలు సమన్వయంతో పనిచేస్తేనే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ దోమల రమేష్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల యువత పెడదారి పడుతోందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ మారం నాగేందర్‌రెడ్డి, ఎంజీయూ అధ్యాపకులు శశిధర్, శివరామ్, ఎంజీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నవీన్‌కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీఐ ఆదిరెడ్డి

ప్రాజెక్టుకు సహకారం

రైతు కల సాకారం

❖ 'కాళేశ్వరం ప్రాజెక్టు'పై అభిప్రాయ సేకరణలో ప్రజల మనోగతం

❖ పరిహారం పెంచి ఇవ్వాలన్న రైతులు

చిట్యాల, న్యూస్‌టుడే: చిట్యాల, నార్కట్‌పల్లి ప్రాంతాల రైతుల కలలను సాకారం చేయగలదనే ఆశాభావంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి అనుకూలంగా ఉన్నామని వివిధ రైతు, ప్రజాసంఘాలు, రాజకీయ పక్షాలు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు 16వ ప్యాకేజీ పనులపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను చిట్యాలలో బుధవారం జిల్లా సంయుక్త పాలనాధికారి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిట్యాలతో పాటు నార్కట్‌పల్లి, రామన్నపేట మండలాలకు చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్షాల నాయకులు హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఈ ప్రాంతంలోని రైతాంగ సాగునీటి కష్టాలు శాశ్వతంగా తొలగిపోతాయనే అభిప్రాయాన్ని పలువురు ప్రజాప్రతినిధులు వ్యక్తం చేయగా, ప్రాజెక్టు పనులను వేగవంతంగా ప్రారంభించి పూర్తి చేయించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. 50 మంది తమ అభిప్రాయాలను ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రధానంగా పర్యావరణ ప్రభావంపై అభిప్రాయ సేకరణ ఏర్పాటు చేసినా దీంతో పాటు పరిహారం చెల్లింపు విషయానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చినట్లు ఇక్కడ మాట్లాడిన వారి అభిప్రాయాల్లో వ్యక్తమైంది. ఈ సందర్భంగా తమకు చేరిన అభిప్రాయాలను తమ ఉన్నతాధికారికి నివేదించనున్నామని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ జవహర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూములు కోల్పోతున్న రైతులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు వ్యక్తపరిచిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.



జేసీకి తమ అభిప్రాయాన్ని అందజేస్తున్న మార్కెట్ కమిటీ పాలకవర్గం

పేద రైతుల గురించి ఆలోచించండి

యాకారి వెంకులు, సుంకెనపల్లి రైతు



కాల్వ నిర్మాణంలో భూమి కోల్పోతున్న పేద రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం ఆలోచించాలి. కాల్వను తెప్పిస్తున్నందుకు మంత్రికి, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు. చిన్న రైతులం. సంతోషంగా కాల్వకోసం భూమిని ఇవ్వడానికి సంతోషంగా ఒప్పుకుంటున్నాము. పరిహారంగా మరోచోట భూమి ఇచ్చినా, నగదు ఇచ్చినా అభ్యంతరంలేదు. కానీ న్యాయం జరిగేలా చూడండి.

పరిహారమే కాదు.. పథకాల్లో ప్రాధాన్యం

చెరుకుపల్లి మహేష్, గుండ్రాంపల్లి, రైతు



భూమిని నమ్ముకున్న పేద రైతులం. మా కుటుంబం పేరిట ఉన్న 10 ఎకరాల్లో 7 ఎకరాలు కాల్వ నిర్మాణంలో కోల్పోవాల్సి వస్తోంది. జాతీయ రహదారి వెంట ఉన్న మా గ్రామంలో భూముల ధరలు అధికంగా ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని పరిహారాన్ని నిర్ణయిస్తే బాగుంటుంది. మాలాంటి రైతులకు పరిహారంతో పాటు ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారుల ఎంపికలో ప్రాధాన్యత కల్పించి ఉపాధి కల్పించాలి.

పడావు భూముల్లో సిరులు పండాలి

మద్దెల మల్లయ్య, వెలిమినేడు, సర్పంచి



వెలిమినేడులో భూగర్భ జలాలు తగ్గిపోయి వ్యవసాయ భూములు పడావుగా మారుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు రాకతో పడావు భూముల్లో సిరులు పండాలని ఆకాంక్షిస్తున్నాము. కాల్వ పనులు త్వరితగతిన పూర్తి చేయిస్తే ఈ ప్రాంతంలో భూగర్భ జలమట్టం పెరిగేందుకు దోహదమవుతుంది. భూములు కోల్పోయిన రైతులకు మేలైన పరిహారం ఇస్తే బాగుంటుంది.

డీపీఆర్‌ను పంచాయతీల్లో అందుబాటులో ఉంచాలి

బండా శ్రీశైలం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



పూర్తిస్థాయి ప్రాజెక్టు రిపోర్టును సంబంధిత పంచాయతీలలో అందుబాటులో ఉంచాలి. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమిని సేకరించి రైతులకు పరిహారాన్ని పెంచి ఇవ్వాలి. రైతులకు సాగునీటిని అందించే ప్రాజెక్టుకు మేము వ్యతిరేకం కాదు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పనుల్లో ప్రాజెక్టు పనుల్లో వేగం తగ్గకుండా ఉండాలంటే ఎంపీ, ఎమ్మెల్యేలు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

సాగునీటి లభ్యత..ఉపాధి పెంపు

వేముల వీరేశం, నకిరేకల్ ఎమ్మెల్యే



కాళేశ్వరం ప్రాజెక్టు రాకతో రైతులకు 29వేల పైచిలుకు ఎకరాలకు సాగునీరు లభించనుంది. దీంతో సాగునీటితో పాటు వృత్తిదారులకు ఉపాధి అవకాశాలు పెరుగనున్నాయి. చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల పరిధిలో 19 గ్రామాల్లో 791 ఎకరాల భూమిని ప్రాజెక్టు కోసం సేకరించనున్నారు. కాల్వల కోసం భూములు కోల్పోయే రైతులకు పరిహారం ప్రభుత్వం నుంచి చెల్లించే విషయంలో నా పూర్తి సహకారాన్ని అందిస్తాను. ప్రాజెక్టు నిర్మాణానికి సానుకూలతతో ముందుకు వచ్చి అభిప్రాయాలు తెలియజేసిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు.

పర్యావరణ ముప్పులేదు

గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్గొండ ఎంపీ



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో చిట్యాల, నార్కట్‌పల్లి ప్రాంతాల్లో పర్యావరణానికి కలిగే ముప్పేమీ లేదు. పైగా దీంతో భూగర్భ జలమట్టం పెరిగే అవకాశాలు మెరుగవుతాయి. గోదావరి జలాలు చిట్యాల ప్రాంతానికి వస్తాయంటే ఎవరూ నమ్మే పరిస్థితి లేకుండేదని, అది ఇప్పుడు ఆచరణలోకి వస్తోంది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూములకు పరిహారం చెల్లించాలని నిర్ణయించింది.

ఇంకా ఎవరెవరు ఏమన్నారంటే..

గోదావరి జలాలు పొందబోతున్న చిట్యాల, నార్కట్‌పల్లి ప్రాంత వాసులు అదృష్ట వంతులు, రెండేళ్ల తర్వాత గోదావరి జలాల ప్రభావం కనిపిస్తుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. ఈ ప్రాంతంలో కరవు, కాటకాలతో పశుగ్రాసం కొరతతో పాల ఉత్పత్తి తరచూ తగ్గుతోందని కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే ఈ సమస్య ఉత్పన్నం కాదని మదర్‌డెయిరీ ఛైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుకు తాము సానుకూలమేనని, రైతులకు పరిహారం మాత్రం ఆలోచించి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ అధికారులను కోరారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లె కాల్వల దుస్థితిని దృష్టిలో పెట్టుకుని కాళేశ్వరం ప్రాజెక్టు పనులను వేగవంతంగా, నాణ్యతతో చేపట్టాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి కోరారు. గోదావరి జలాల రాకతో రైతుల కష్టాలు తీరనున్నాయని ఎంపీపీ బట్టు అరుణ, జడ్పీటీసీ సభ్యుడు శేపూరి రవీందర్, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు గోదుమగడ్డ పద్మ, సింగిల్విండో అధ్యక్షుడు నర్రా మోహన్‌రెడ్డిలు అన్నారు. కార్యక్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు ఈఈ (నీటిపారుదలశాఖ) హైదర్‌ఖాన్, ఆర్డీవో ఇ.వెంకటాచారి, తహసీల్దారు సీహెచ్ విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.



అభిప్రాయ సేకరణకు హాజరైన ప్రజలు

తెలంగాణను హరితవనంగా మార్చాలి

మేళ్లదుప్పలపల్లి(నల్గొండ గ్రామీణం), న్యూస్‌టుడే: హరితహారంలో విరివిగా మొక్కలు తెలంగాణను రాష్ట్రాన్ని హరితవనంగా మార్చాలని తెరాస రాష్ట్ర కార్యదర్శి చాడా కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం మేళ్లదుప్పలపల్లిలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం, పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. పచ్చదనం వెల్లివిరిస్తేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని.. ప్రకృతి సహకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సైదులు, లింగయ్య, రవీందర్, శంకర్‌రెడ్డి, భిక్షమయ్య, సంతోష్, వెంకటాద్రి, వెంకన్న, శ్రవణ్, వెంకన్న, శేఖర్ పాల్గొన్నారు.



మొక్కలకు నీళ్లు పోస్తున్న చాడ కిషన్‌రెడ్డి

ఎంజీయూలో కొనసాగుతున్న ఈ-లెర్నింగ్ శిక్షణ



ఎంజీయూలో ఈ- లెర్నింగ్ శిక్షణ పొందుతున్న జిల్లా అధికారులు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నల్గొండ పరిధిలోని అన్నెపర్తి మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో జిల్లా అధికారులకు ఇస్తున్న ఈ-లెర్నింగ్ శిక్షణ కొనసాగుతోంది. బుధవారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీ సీఈఓ హనుమానాయక్, డీఈవో చంద్రమోహన్ మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఉద్యోగులు, అధికారులకు ఈ లెర్నింగ్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 12 నైపుణ్య అంశాలు, 3 విషయాంశాలకు సంబంధించిన మాడ్యూల్స్‌ను ఆన్‌లైన్ విధానం ద్వారా చదివే నూతన విధానాన్ని డీవోపీటీ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. సీపీఓ సురేందర్, హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, మాస్టర్ ట్రైనర్స్ పరమేశ్‌యాదవ్, అంజయ్య, ఇ-డిస్ట్రిక్ మేనేజర్ దుర్గారావు, జిల్లా ట్రైనింగ్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, అశోక్ పాల్గొన్నారు.

చేనేతను తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది

చౌటుప్పల్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి, చేతివృత్తులకు తగిన ప్రాధాన్యత నిస్తున్నదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్ అన్నారు. ఆయన రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, అక్కడి కార్పొరేటర్లు బుధవారం చౌటుప్పల్‌లోని చేనేత పారిశ్రామిక సహకార సంఘాన్ని సందర్శించారు. చేనేత కార్మికులు మగ్గాలపై నేసిన వస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడారు. చేనేత వృత్తిదారుల సమస్యలను తెలుసుకున్న కేటీఆర్ వారి సంక్షేమానికి పలు పథకాలను ప్రకటించారని తెలిపారు. ఒకప్పుడు వ్యవసాయం తర్వాత చేనేత పరిశ్రమ ఉండేదని, క్రమక్రమంగా ఈ వృత్తి అంతరించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో అన్ని చేతివృత్తులకు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సమావేశానికి సహకార సంఘం అధ్యక్షుడు కందగట్ల భిక్షపతి అధ్యక్షత వహించారు. సంస్థాన్ నారాయణపురం జడ్పీటీసీ సభ్యుడు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి బొంగు లావణ్య, చేనేత నాయకులు బడుగు లక్ష్మయ్య, గుర్రం నర్సింహ, బడుగు అంజయ్య, గడ్డం యాదగిరి, గోశిక అంజయ్య, నోముల రఘునాథ్, గంజి వెంకటేశం, శ్రీరాములు, ప్రభాకర్, ధనుంజయ్య, రాములు పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో సమావేశంలో మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్, పక్కన ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు

Junior Inter
STUDY PLAN
CHEMISTRY

A top ranker says that clear cut strategy, clarity of concepts, memorising the formulae and focussed preparation are essential for grand success. Systematic planning helps to get good score in competitive exams. By doing so one can reach the goal easily.

ప్రతిభ

The 'brain of chemistry' is..

Read Chemistry regularly early in the morning in order to retain chemistry for ever. Identify most repeated VSAQs (2 Marks), SAQs (4 Marks), LAQs (8 Marks) from previous I.P.E. papers. It is comfortable to answer in LAQs, SAQs and VSAQs order for 100% score in B.I.E. Most of the times some of the VSAQs are not repeated from few lessons, so one must learn all VSAQs given at chapter end, intext, inbox and solved questions.

For Very Short Answer Questions

(SAQs - 2 Marks)

Put more efforts on States of matter, Stoichiometry, Thermodynamics, Chemical equilibrium & Acids-bases, Alkali & Alkaline earth metals, Group 13 & 14 elements, Environmental Chemistry and Organic Chemistry.

For Short Answer Questions

(SAQs - 4 Marks)

Learn questions from States of matter, Stoichiometry, Thermodynamics, Chemical equilibrium and Acids - Bases, H_2 & Its compounds, 13th & 14th groups, Chemical bonding and Organic Chemistry.

For Long Answer Questions

(LAQs - 8 Marks)

3 LAQs are coming only from Atomic Structure, Classification of elements, Chemical bonding and Organic Chemistry.

Atomic Structure

(8 Marks)

★ **For I.P.E.:** LAQs 1) 4 Quantum numbers 2) Postulates, limitations of Bohr's model of H atom, line spectrum of H atom.

★ **For competitive exams:** Rydberg's equation, work function, K.E., P.E., T.E., de Broglie, Heisenberg's uncertainty principle related problems and concepts. Quantum numbers, shapes of orbitals, quantum mechanical model, radial nodes and angular nodes.

Classification of Elements And Periodicity in Properties

(8 Marks)

★ **For I.P.E:** LAQs 1) $I.E._1$ & $I.E_2$, Comparison, Factors effecting 2) s, p, d, f block elements 3) Periodic property def. & their variation in group & period- I.E, E.N., E.G.E., atomic radius, nature of oxides.

★ **For competitive exams:** Criss - Cross rule, position of elements, valency, types of radii, iso electronic and all the periodic properties (exceptions trends in groups, periods and both).

Chemical Bonding And Molecular Structure

(4 + 4 or 8 Marks)

We can consider this lesson as back bone of entire chemistry. Clarity of each & every concept is very important for all types of exams.

★ **For I.P.E:** LAQs 1) Hybridisation (def. & sp, sp^2, sp^3 types) 2) MOED of O_2 & N_2– their bond order & magnetic nature.

SAQs: 1) Hybridisation of PCl_5 & SF_6
2) Hydrogen bond, types
3) Dipole moment def., applications
4) Dative bond def., examples



5) Postulates of VSEPR theory.

★ **For competitive exams:** Complete MOT, VSEPR Theory, formal charge, hybridisation, Hydrogen bond, Fajan's rules, dipole moment, no. of lone pairs - bond pairs and bond parameters.

States of Matter : Gases and Liquids

(2 + 4 Marks)

★ **For I.P.E.:** SAQs: 1) Postulates of Kinetic molecular theory of gases 2) Deduction of gas laws: Avogadro, Boyle, Charle's, Dalton, K.E, Graham's law 3) Derivation of ideal gas equation 4) Graham's law (def. & problem) 5) Dalton's law (def. & problem) 6) 3 types of speeds (def. & problem) and solved problems 4.4 to 4.6.

★ **VSAQs:** 4, 10, 15, 18, 19, 22, 32 to 35, 42, 43, 45 and 4.7 to 4.10

★ **For competitive exams:** Vander Waal's equation, K.E., problems on 3 types of speeds, Graham's Law, Dalton's law and concepts of viscosity, Surface tension.

Stoichiometry

(2 + 4 Marks)

Stoichiometry is heart of chemistry. Art of learning physical chemistry lessons and some of the Inorganic chemistry lessons are well linked with this lesson.

★ **For I.P.E:** SAQs: 1) Balancing of redox reactions in acid medium & basic medium 2) E.F. & M.F. related problems.

★ **VSAQs:** 1, 3, 5 to 8, problems on w-w, w-v, v-v and equivalent weights solved problems: 5.1, 5.2, 5.4, 5.6 to 5.9, 5.14 law of definite proportions, law of multiple proportions.

★ **For competitive exams:** Significant figures, accuracy, precise, oxidation numbers, M, N, m, x, Eq. Wts, E.F., M.F., oxidising and reducing agents, mole concept, stoichiometric calculations.

Thermodynamics

(4 or 2 + 2 marks)

★ **For I.P.E.:** SAQs: 1) Hess's law 2) $C_p - C_v = R$ 3) Problems on types of Enthalpies.

★ **VSAQs:** 2, 14, 22, 25, 29, 32, 37 and intext questions 6.3, 6.4, 6.11, 6.12

★ **For competitive exams:** State function, path function, 1st, 2nd, 3rd laws of thermodynamics, entropy, enthalpy of formation, combustion, H, E, G related problems, criteria of spontaneity (ΔG, ΔH, ΔS linked), extensive and intensive properties.

Chemical Equilibrium & Acids - Bases

(2 + 4 Marks)

★ **For I.P.E:** SAQs: 1) Lechatlier's principle (def. & synthesis of SO_3 & NH_3) 2) K_c, K_p relation for SO_3, NH_3 equilibria 3) Lewis theory 4) Buffer solutions (def, types, examples, buffer action, problems) 5) Salt Hydrolysis def. & nature of 3 types of salt solutions 6) Solubility - Solubility product - common ion effect and intext questions 7.14, 7.15, 7.17, 7.25 to 7.28.

★ **VSAQs:** 1, 4, 5, 7, 11, 12, 13, 24, 26, 30, 31, 69. Intext Questions: 7.2, 7.5, 7.7, 7.11, 7.14, 7.15, 7.17, 7.25 to 7.28.

★ **For competitive exams:** Q_C & K_C, K_C & K_P relation, problems on pH, K_w, K_a, K_b, K_c, Ksp, buffer solutions and salt hydrolysis of different salts.

Hydrogen & Its Compounds

(4 Marks)

★ **For IPE:** SAQs: 1) Utility of H_2 as fuel 2) Temporary & Permanent hardness of water calgon (or ion exchange method). 3) All types of hydrides 4) Oxidising and reducing properties of H_2O_2. 5) Preparation of H_2O_2 by auto oxidation method & electrolytic method.

★ **VSAQs:** There is a possibility of asking two 2 marks questions like What is syn gas/ Coal gasification/ Auto protolysis/ Uses of D_2O/ M.P., B.P. of D_2O/ 3 isotopes of H/ Use of H_2 in welding of high melting metals/ Water is amphoteric in Bronsted sense/ Why B.P. of H_2O is greater than H_2S?

★ Chapter end questions: 1, 2, 4, 5, 9, 10, 11, 15, 16, 19, 33.

★ **For competitive Exams:** Types of hydrides, problems on H_2O_2 & Hardness of water. Comparison of physical properties of H_2 & D_2, H_2O & D_2O, Calgon & ion exchange methods.

Alkali & Alkaline Earth Metals

(2 + 2 Marks)

★ **For IPE:** VSAQs: Biological importance of Ca^{+2}, Mg^{+2}, Na^+, K^+, Lesson end questions: 3, 4, 5, 6, 11, 12, 14 to 28, 33, 34, 36, 37, 42, 43. Why is KO_2 is paramagnetic? What is the Oxi. state of K in KO_2?

★ **For competitive exams:** Order of hydrated ions size, order of density, SRPs, reducing strength, solubility, lattice enthalpies of IA metals, Na-K pump, IA, IIA metal solutions in NH_3 (liq.), Uses of Cu-Be, Mg-Al alloys, Mg CO_3. It is advisable to make notes of key points & trends of periodic properties (especially anamalous properties) of 1st to 18th groups.

Group -13 Elements

(2 + 2 or 4 Marks)

★ **For I.P.E.:** **SAQs:** 1) Borax bead test 2) Structure of Diborane 3) Preparation & Chemical Properties of B_2H_6.

★ **VSAQs:** 1) Formula of borazine & Its common name. 2) Inert pair effect def. Stability of Tl^{+1} Salts. 3) Hybridisation of B in Borazine & Diaborane.
4. Structure of Borazole & Orthoboric acid.

★ **For competitive exams:** Physical properties, Inert pair effect, structural aspects of diborane, borax, boric acid, chemical properties of diborane, borax bead test, in text, inbox questions.



Writer:
A.N.S. Sankara Rao
Subject Expert

Group - 14 Elements

(2 + 2 or 4 Marks)

★ **For I.P.E:** SAQs: 1) Difference in properties of diamond and graphite 2) Write a short note on allotropy, catenation, inert pair effect, green house effect.

★ **VSAQs:** 1 to 31, 34d, 41, 42, 43c, 44, 45a, b, 48, 50 a, b, c, uses of Zeolites, silicones, what are fullerenes? CCl_4 doesn't dissolve in water but $SiCl_4$ dissolves. Why?

★ **For competitive exams:** Inert pair effect, uses & structures of Silicates, Silicones, Zeolites, pH of $H_2CO_3/H_2CO_3^-$ system, structure of fullerene, Types of Oxides, hydrolysis of compounds.

Environmental Chemistry

(2 + 2 Marks)

★ **For I.P.E.:** VSAQs: Sink, receptor, BOD, COD, pollutant, contaminant, TLV, Eutrophication, BOD values of clean and polluted water, DO (def. values of cold water & air), green house effect, acid rains (def., gases, causes, ill effects), chapter end questions 23, 29, 1, 2, 6, 15, 17.

★ For competitive exams: All key points.

Organic Chemistry

(2 + 4 + 4 or 2 + 8 = 10 Marks)

Organic chemistry is the 'brain of chemistry' as it is well connected to fundamentals of other lessons like chemical bonding. Highest weightage is given to this lesson. Once the logic of this lesson is known, one can score good marks in all types of exams. It is very essential to learn all the basics, concepts & their applications to score good marks in EAMCET, NEET, BITSAT, JEE Mains & Advanced like exams.

★ **For I.P.E.:** LAQs: 2 preparations & all chemical properties of C_2H_2, C_2H_4, C_6H_6

★ **SAQs:** 11 to 17, 32, 37, 39, 42, 43, 49, 57 and 59.

★ **VSAQs:** Isomers of C_3H_6O, What is polymerization? IUPAC Nomenclature (names & structures), chapter end questions: 1 to 8, 27 and solved problems 13.1 to 13.12, 13.19, 13.20 to 13.25, 13.30, 13.34, 13.36, 13.38.

★ **For competitive exams:** Identification of prefix, root word, primary & secondary suffix in organic compounds make IUPAC nomenclature easier. All named reactions, qualitative & quantitative analysis calculations, reactions, types of isomerism, conformers of ethane, electron displacement reactions, directional influence of functional groups in monosubstituted benzene, reaction mechanisms, conversions, bond parameters several revisions are required to retain Organic chemistry in mind.

రుణాలు జాగ్రత్తగా వాడుకోవాలి

ఎడపల్లి, న్యూస్‌టుడే: మహిళా పొదుపు సంఘాలకు ఇస్తున్న రుణాలు జాగ్రత్తగా వాడుకోవాలని ఏపీఎం సాయిలు సూచించారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పోచారం, దుబ్బాతాండ గ్రామాల్లో రికవరీ తక్కువగా ఉందన్నారు. గ్రామ సంఘాలు దీనిపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, శ్రీదేవి, సీసీలు పొండు, సంజీవ్, సాయిలు తదితరులు ఉన్నారు.

బోధన్

ధర్మాస్పత్రుల్లో కాన్పుల సంఖ్య మెరుగు



సాలూర సభలో ప్రసంగిస్తున్న ఎంపీ కవిత

బోధన్, న్యూస్‌టుడే: సర్కారు ఆస్పత్రుల్లో కాన్పుల శాతం పెంచడానికి తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఎంపీ కవిత అన్నారు. బుధవారం మండలంలోని సాలూరలో మన ఊరు-మన ఎంపీ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర చేసిన ఆమె తితిదే కల్యాణ మండపంలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. హున్సా, ఖాజాపూర్, మందర్నా గ్రామాల రైతులకు పంట పెట్టుబడి రాయితీ కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. గ్రామీణ కులవృత్తులను ప్రోత్సహించేందుకు రూ.వెయ్యి కోట్ల నిధుల కేటాయింపుతో ఎంబీసీ సంస్థ ఏర్పాటు చేశామన్నారు. రూ. 33 లక్షల విలువ గల గొర్రెలను సాలూరకు అందించామన్నారు. ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ మాట్లాడుతూ.. చెరకు రైతులు ప్రశ్నిస్తారనే ఆలోచనతో తాను కొన్ని గ్రామాలకు రావడం లేదని చెప్పడం సరికాదన్నారు. విషయాలను ఎదుర్కొంటానే తప్ప భయపడే మనస్తత్వం తనకు లేదన్నారు. నిజాంషుగర్స్ క్రషింగ్ నిలిచిపోయిన 2015 సీజన్‌లో నిజాంసాగర్, కామారెడ్డి చక్కెర పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించి ఈ ప్రాంత చెరకును అక్కడికి మళ్లించి రైతులకు రవాణా ఖర్చులు ఇచ్చామన్నారు. పంట పెట్టుబడి రాయితీ కోసం తీవ్ర కృషి చేస్తున్నామని చెప్పారు. మూడేళ్ల కాలంలో ఒక్క సాలూరకే ప్రగతి పనుల కోసం రూ.82 లక్షలు ఇచ్చామన్నారు. సాలూర వద్ద మంజీర నదిపై చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.55 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, హైడ్రాలిక్ అనుమతులు అవసరం లేదన్నారు. నిజాంసాగర్ కాలువల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేయించడానికి రూ.93 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వివరించారు. కేంద్రం నుంచి మరో రూ.15 కోట్లు అదనంగా వస్తున్నాయన్నారు. మైనారిటీల అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మండలాలను ఎంపిక చేయగా అందులో ఎడపల్లి ఒకటన్నారు. ఎమ్మెల్సీ

ఎంపీ కవిత

వీజీగౌడ్, ఎంపీపీ గంగాశంకర్, జడ్పీటీసీ సభ్యురాలు లావణ్య, డీసీసీబీ అధ్యక్షుడు గంగాధర్‌రావు పట్వారీ, సహకార సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్, తెరాస మండల అధ్యక్ష, కార్యదర్శి సంజీవ్, షకీల్ తదితరులు ప్రసంగించారు. పుర సంఘం అధ్యక్షుడు ఎల్లయ్య, మాజీ అధ్యక్షురాలు సునీత, మాజీ ఎంపీపీ గంగారెడ్డి, ఐకాస మాజీ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, నాయకులు కరీముద్దిన్, ముత్తెన్న, వీఆర్‌దేశాయ్, ధనుంజయ్, రవికిరణ్, పీఆర్టీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు శంకర్ తదితరులు ఉన్నారు.

మండల సమావేశంలో ఫిర్యాదులు

అంతకుముందు ఎంపీపీ గంగాశంకర్ అధ్యక్షత నిర్వహించిన బోధన్ మండల పరిషత్తు సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్సీ వీజీగౌడ్, ఎమ్మెల్యే షకీల్‌తో కలిసి ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. వంటశాల, అదనపు తరగతి గదుల అవసరాలపై ప్రతిపాదనలు పంపాలని ఎంఈవో శాంతకుమారికి సూచించారు. బడుల్లో ఉపాధ్యాయులు, అటెండర్ల కొరతపై తమకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మినార్‌పల్లి పాఠశాల తలుపులు, కిటికీలు శిథిలమయ్యాయని గ్రామ సర్పంచి తెలిపారు. బిక్నెల్లి పాఠశాల ఉపాధ్యాయుడిని నర్సాపూర్‌కు డిప్యుటేషన్ వేసి విద్యార్థులకు అన్యాయం చేశారని ఎంపీటీసీ సభ్యులు శ్యాంరావు ఆరోపించారు. ఖండ్‌గావ్ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి మూసి వేశారని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ఎత్తిపోతల పథకాలపై తనకు నివేదిక పంపాలని ఎంపీ అధికారులను కోరారు. మిషన్ భగీరథ పైప్‌లైను ప్రతి పాఠశాలకు వేసే విషయంలో సర్పంచి, ఎంపీటీసీ సభ్యులు చొరవ చూపాలని ఎమ్మెల్యే షకీల్ సూచించారు. సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరును సమీక్షించిన ఎంపీ పనితీరు మెరుగుపర్చుకోవాలని వైద్యురాలు అంబికకు సూచించారు. పెగడాపల్లిలో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారని వైద్యుల నియామకం లేక ఫలితం వ్యర్థమవుతోందని ఎంపీపీ గంగాశంకర్ తెలిపారు. బాన్సువాడకు తరలించిన పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయాన్ని బోధన్‌లోనే కొనసాగించాలని కోరారు. చిన్నమావంది, పెద్దమావంది రైతుల కోసం చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టాలని సర్పంచి రాజు కోరారు. నిజాంసాగర్ ప్రధాన కాలువ విస్తరణ ప్రతిపాదనలు రూపొందించాలని నీటిపారుదలశాఖ



హాజరైన గ్రామస్థులు

డీఈ శ్రావణ్‌కుమార్‌ను ఆదేశించారు. ఎమ్మెల్సీ వీజీగౌడ్ మాట్లాడుతూ. హరితహారాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి గంగామణి, ఎంపీటీసీలు సావిత్రి, కళావతి, తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మండల సమావేశాలను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సభ్యులు తెలిపారు. తాము హాజరైన సమావేశానికి గైర్హాజరైన అధికారులకు శ్రీముఖాలు పంపాలని సబ్‌కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు సూచించారు.

సాలూర అభివృద్ధికి రూ.50 లక్షలు

బోధన్: మండలంలోని సాలూర గ్రామంలో బుధవారం మన ఊరు- మన ఎంపీ కార్యక్రమంలో పాదయాత్ర చేసి ప్రజలను కలిసిన ఎంపీ కవిత వరాలు ప్రకటించారు. ఈ సంవత్సరం గ్రామాభివృద్ధికి రూ.50 లక్షలు ఇస్తానని, వచ్చే ఏడు మరిన్ని నిధులు అందజేస్తానన్నారు. ఆమె ప్రకటించిన నిధుల వివరాలు ఇలా ఉన్నాయి. మహిళా భవనం మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.5 లక్షలు, ముదిరాజ్ సంఘం భవనానికి రూ.15 లక్షలు, సొంత ఖర్చుతో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం, ఎస్సీ సామాజిక భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, గంగమ్మ ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షలు, సర్కారు పాఠశాలకు ఏడు అదనపు తరగతి గదుల నిర్మాణం, జాగృతి సంస్థ నుంచి కంప్యూటర్‌లు, సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి పెంపు, మైనారిటీలకు షాదీఖానా నిర్మాణం, సాలూర అనుబంధ గ్రామం ఫత్తేపూర్‌కు రూ.15 లక్షలు ప్రకటించారు. అలాగే నాగన్‌పల్లి నుంచి సాలూర చెక్‌పోస్టు వరకు రూ.25 కోట్లతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే షకీల్ తెలిపారు. శిథిల స్థితిలో ఉన్న బోధన్ బైపాస్ రహదారికి రూ.5.5 కోట్లు వచ్చాయన్నారు.

ఎంపీకి వినతుల వెల్లువ

బోధన్, న్యూస్‌టుడే: ఎడపల్లి మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన వృద్ధాశ్రమానికి నిధులు ఇవ్వాలని బోధన్‌లోని లయన్స్ ప్రతినిధులు బుధవారం ఎంపీ కవిత, ఎమ్మెల్యే షకీల్‌ను కోరారు. ఎమ్మెల్యే రూ.10 లక్షలు ఇవ్వడానికి అంగీకారం తెలిపారు.

బోధన్ గ్రామీణం: మండలంలోని ఫత్తేపూర్, తగ్గెల్లి, ఫత్తెపూర్, హున్సా, మందర్న, ఖాజాపూర్ గ్రామాల్లో అంతర్గత రహదారులు, మురుగుకాల్వలు నిర్మించేందుకు నిధులు అందించాలని కోరారు. కల్దుర్కిలో జడ్పీ ఉన్నత పాఠశాలకు అదనపు గదుల మంజూరుకు జనసీయూత్ సభ్యులు విన్నవించారు. జాడి ఎత్తిపోతల పథకాన్ని పుపరుద్ధరించాలని గ్రామస్థులు కోరారు.

ఎడపల్లి: ఎడపల్లిలో సర్పంచి శంకర్‌నాయుడు ఆధ్వర్యంలో ఎంపీకి స్వాగతం పలికి గ్రామానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. జానకంపేట గ్రామంలో సర్పంచి దశరథ్ సమస్యలను నివేదించారు. సాటాపూర్ గేట్ దగ్గర దుబ్బాతాండ గ్రామస్థులు ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు.

బోధన్ పట్టణం: పట్టణంలో 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బీసీ కార్పొరేషన్ రుణాలు విడుదల కాకపోవడంతో 43 మంది లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని భాజపా ఫ్లోర్‌లీడర్ రామరాజు ఎంపీకి వినతి పత్రం ఇచ్చారు. బోధన్ మండలం, పట్టణానికి సంబంధించిన మున్నూరుకాపు కల్యాణ మండపం కోసం మూడెకరాల స్థలం ఇప్పించాలని ఆ సంఘం పట్టణాధ్యక్షుడు బీర్కూర్ శంకర్, ఎంపీపీ గంగాశంకర్ విన్నవించారు.



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న బోధన్ పట్టణవాసులు

స్వాగత బోర్డు ఏర్పాటు



సూచిక బోర్డు ఏర్పాటులో పాల్గొన్న ప్రతినిధులు

యంచ(నవీపేట గ్రామీణం), న్యూస్‌టుడే: పవిత్ర బాసర పుణ్యక్షేత్రానికి జిల్లా సరిహద్దు దాటి వెళ్లే భక్తులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన సూచిక బోర్డును జిల్లా సరిహద్దు గ్రామమైన యంచ వద్ద ఏర్పాటు చేశారు. బుధవారం వాసవీక్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఆదికేశవన్ దీనిని ప్రారంభించారు. క్లబ్ సీనియర్ సిటిజన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఈ సూచికను ఏర్పాటు చేశారు. సీనియర్ సిటిజన్ సభ్యులు దీనిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ మనోజ్‌కుమార్, ఇందూర్ యజ్ఞసమితి నాగభూషణంగుప్తా, అధ్యక్షుడు విరేశం, సర్పంచి లింగన్న, ఎంపీటీసీ సభ్యుడు సాయిలు తదితరులు ఉన్నారు.

వర్షాకాలంలోనూ తాగునీటి పాట్లు..

పేపరుమిల్లు(రెంజల్), న్యూస్‌టుడే: మండలంలోని పేపరుమిల్లు గ్రామంలో రోజురోజుకూ తాగునీటి ఇబ్బందులు తీవ్రమవుతున్నాయి. ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నా ఇక్కడి పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో గోదావరి ఉన్నా ఇక్కడి ప్రజల గొంతు తడవడం లేదు. కార్యదర్శి పక్షం రోజులకోసారైనా గ్రామాన్ని సందర్శించిన సందర్భాలు లేవని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నీటి కోసం వ్యవసాయ, కూలి పనులు వదులుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామంలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు రెండు ట్యాంకులు ఉన్నా అవి పూర్తిస్థాయి ప్రయోజనాన్ని ఇవ్వడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామ పొలిమేరల్లోని వ్యవసాయ బోరుబావులను ఆశ్రయిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1500 జనాభా ఉన్న నీలా పంచాయతీ పరిధిలోని ఈ గ్రామం వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తమ దాహార్తి తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పేపరుమిల్లు గ్రామంలో తాగునీటిని వ్యవసాయ బోరు బావుల నుంచి సైకిల్‌పై మోసుకెళ్తున్న యువకుడు



గ్రామ పొలిమేరల్లోని ఆలయం వద్ద నీటి కోసం డబ్బాలను వరుసలో పెట్టిన గ్రామస్థులు

పట్టించుకునేవారు లేరు



ఎన్నికల సమయంలో గ్రామానికి పరుగులు పెట్టే పాలకులు తర్వాత గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదు. తాగునీటి సమస్యపై సర్పంచికి, కార్యదర్శికి విన్నవించినా పట్టించుకొవడంలేదు. తాగునీటి కోసం పనులు వదులుకుంటున్నాం. శివారు ప్రాంతంలోని వ్యవసాయ బోరుబావులే తమకు శరణ్యంగా మారాయి. బోరుబావుల రైతులను బతిమాలి బిందెడు నీటిని తెచ్చుకుంటున్నాం. ప్రభుత్వం గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని పంచాయతీ సిబ్బందికి సూచించినా ఇక్కడి పరిస్థితులు మారడం లేదు. ఇప్పటికైనా తమగోడును చూసి తాగునీటి సమస్య తీర్చాలి.

- పర్వయ్య, గ్రామస్థుడు

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎంపీ

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ కవిత అన్నారు. బుధవారం నూతన అంబేడ్కర్ భవనంలో నిజామాబాద్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. దీనికి ఎంపీ కవిత, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, నగర మేయర్ సుజాత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జర్నలిస్టులను అన్ని రకాలుగా ఆదుకోవడానికి ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందన్నారు. ఉద్యమ సమయంలో తెలంగాణ జర్నలిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. ఉద్యమ ఉనికి ప్రజలకు తెలియజేయడానికి ఎంతో శ్రమించారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం జర్నలిస్టుల కోసం రూ.100 కోట్లతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిందన్నారు. పాత్రికేయులకు అక్రిడేషన్, హెల్త్‌కార్డులు అందించామన్నారు. వీటిని అందించడానికి కొద్దిగా ఆలస్యమైనా కూడా పాత్రికేయులు అనారోగ్యానికి గురైతే వారి చికిత్స కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి నిధులు కేటాయించి చికిత్సలు చేయించామన్నారు. మరణించిన పాత్రికేయుల కుటుంబంలో పిల్లల చదువుకు రూ.3 వేలు అందిస్తామని చెప్పారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్యను పరిష్కరిస్తామన్నారు. రెండు పడక గదుల ఇళ్లు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తరువాత నూతనంగా ఏర్పడిన నిజామాబాద్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం, ప్రెస్ ఫొటోగ్రాఫర్స్ సంఘం కార్యవర్గంతో ప్రమాణా స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్‌లకు జ్ఞాపికలను అందజేశారు.


ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కవిత

ధర్నాను విజయవంతం చేయాలి

కంఠేశ్వర్, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకం(సీపీఎస్) విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానం పునరుద్ధరణకై జిల్లా కేంద్రంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సత్యనారయణ పిలుపునిచ్చారు. ధర్నా విజయవంతానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో టీఎన్‌జీఓ భవన్‌లో ఈ నెల 24న జరిగే సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఎస్‌తో 1.20 లక్షల కుటుంబాల భద్రత అగమ్యగోచరంగా మారందని, ఈ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని డిమాండు చేశారు.

వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

శివాజీనగర్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో రెండు చోట్ల ఉన్న వెల్‌నెస్ సెంటర్లకు వెళ్ళి ఆసుపత్రులకు సిఫారసు చేయించుకనేందుకు ఇబ్బందిగా మారిందని, ఉత్తర తెలంగాణకు కేంద్రంగా ఉన్న నిజామాబాద్‌లో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ నాయకులు ఎంపీ కవితకు బుధవారం నగరంలో వినతిపత్రం అందజేశారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు వల్ల ఉద్యోగులు, జర్నలిస్టులకు మేలు జరుగుతుందని తెలిపారు.

EENADU CLASSIFIEDS

MARRIAGE SERVICES

వైశ్య పెళ్ళి సంబంధాలు

వైశ్య వధూవరుల 8వ పరిచయ వేదిక **27-08-2017** డాక్టర్స్, ఇంజనీర్స్, వ్యాపారస్తులకు, ఎలాంటి కమీషన్ లేకుండా ఒకే రిజిస్ట్రేషన్ ఫీజుతో ప్రతి నెల చివరి ఆదివారం 10 వేదికలు

సుమంగళి సేవా సంస్థ
నిజామాబాద్, సెల్: 9246913222

BUSINESS SERVICES

BUSINESS OFFER

Setup your Own Soft Skills Franchise with Min Investment & Earn Regular Income. perfectsoftskills.in ✆ 8639637042/ 9848741400

నెలకు రూ.20 వేలు పైగా ఆదాయం. ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మెషిన్లు అమ్మకం. ముడిసరుకు ఇచ్చి తయారైన సరుకు కొంటాం. సంప్ర॥ రేవతి: ✆ 91339 39828 & 91339 44327.

థర్మాకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారుచేయు మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నె॥ 20 వేలు పైగా ఆ॥, బై బ్యాక్ అగ్రిమెంట్. సై్క ఇంజినీరింగ్ కం॥, ఉప్పల్, HYD. ✆ 81063 70234.

ప్లాస్టిక్ పరిశ్రమ - మెషిన్లు అమ్మకం. ఇంటివద్దనే సరుకు తయారీ, ముడిసరుకు ఇచ్చి తయారైనది కొంటాం. నెలకు 20 వేలు పైగా ఆదాయం. 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. RJ ఎం॥ప్రై॥, ✆ 95818 85278.

శ్రీ సాయి క్యాండిల్స్ నిజామాబాద్ కొవ్వొత్తుల & తయారి ద్వారా రోజుకు 800/- వరకు సంపాదన. అచ్చుమైనము అమ్ముతాము తయారైన క్యాండిల్స్ కొంటాము. ✆ 9542363151

FOR SALE

NZB కంఠేశ్వర్‌లో ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ఫర్నీచర్ మరియు అడ్డతో, మాస్టర్లు, క్లీనర్లతో సహా అమ్మబడును. సంప్ర॥. ✆: 8522002818, 9848971908.

LAND FOR SALE

1 ఎకరం 6 గుంటలు పొలం కాలూర్‌లో అమ్మబడును. NZBకి అతిదగ్గరలో 4 కిమీ దూరంలో ఉంది. సం॥ 9652200253, 9989910410.

PROPERTY FOR SALE

బిల్డింగ్ ప్రాపర్టీ ఫర్ సెల్, నిజామాబాద్ పట్టణంలోని Hydరోడ్, కపిల హోటల్ ప్రక్కన గల SR మల్లయ్య కాంప్లెక్స్‌లో ఉన్న 313 గజాల కమర్షియల్ బిల్డింగ్ ప్రాపర్టీ అమ్మకానికి కలదు. ఆసక్తిగల వారు వెంటనే సంప్ర॥. సెల్: 9848256780, 9866423667.

బిల్డింగ్‌లు అమ్మబడును. నిజామాబాద్ నగరంకు ఆనుకొని ఉన్న ఖానాపూర్ బైపాస్ రోడ్‌కు ఆనుకొని ఉన్న మంచి రెసిడెన్షియల్ ఏరియాలో నూతనంగా, ఆధునికంగా అన్ని సౌకర్యాలతో మంచి వాతావరణంలో నిర్మించిన బిల్డింగులు 2BHKతో 183 చ.గ. వైశ్యాలం గలది అమ్మబడును. ఆసక్తిగలవారు సంప్రదించండి. సెల్ నెం: 9848031658.

TO-LET

NZB ఆదర్శ నగర్, దుబ్బ 1600 Sft అన్ని రూంలు POP & కప్‌బోర్డ్స్‌తో గల 1st ఫ్లోర్‌లో 2BHK పోర్షన్ అద్దెకు ఇవ్వబడును. ✆: 9848020856, 9912999013.

JOBS

10th నుండి డిగ్రీ అర్హత గల యువకులకు ఉద్యోగ అవకాశం. వయస్సు 18 to 28 సం॥, సంపాదన: 10 వేలు, ఫ్రీ హాస్టల్ కలదు. ✆ 76618 20432, 08462 - 237222.

ఫీజులేదు Hyd లో ప్రముఖ MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకింగ్‌బాయ్స్, సూ॥వైజర్స్ కా॥ జీ: 13-18 వేలు రూం + భోజనం ఫ్రీ. ESI + PF చదువు లేకున్నా జాబ్, ✆ 7330250599.

హైదరాబాద్‌లోని ఇళ్లల్లో 24గం॥లు వృద్ధులకు సేవ చేయడానికి, వంట చేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడవారు/ మగవారు కావలెను. జీతం: 9 వేలు భో+ వసతి ఫ్రీ. ✆ 7032025222.

ఆస్కార్‌చిట్స్ ప్రై.లి. నిజామాబాద్ & ఆర్మూర్ బ్రాంచ్‌ల నందు పనిచేయుటకు Ass. బిజినెస్ మేనేజర్స్ మరియు కలెక్షన్ బాయ్స్ కావలెను. (Exp. పర్సన్స్) సం॥ ✆: 8466997514, 8466995877.

Hyd లో గల ప్రముఖ లిమిటెడ్ కంపెనీలకు హెల్పర్స్, ప్యాకర్స్, సూ॥వైజర్స్, B.Sc కెమిస్ట్రీ, ITI ఆల్‌ట్రేడ్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 10,000/- to 16,000/- (రూం+మీల్స్ సౌకర్యం) ✆ 9705549598/ 9553632447

ప్రముఖ లిమిటెడ్ కంపెనీలో పనిచేయుటకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, ఇన్‌ఛార్జీలు, కావలెను. జీతం:16,000, OT కలదు. రూం+ భోజనం ఫ్రీ. Cell: 81253 05238.

మన జిల్లాలోని లిమిటెడ్ కంపెనీలకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, ఇన్‌ఛార్జిస్ ITI వారు కావలెను. జీతం 16 వేలు, O.T. కలదు. రూము+ భోజనం ఫ్రీ. సెల్: 9618961130.

ప్రముఖ కం॥లో పనిచేయుటకు సూ॥వైజర్స్, హెల్పర్స్, ప్యాకర్స్ కావలెను. జీ: 17 వేలు OTతో ఆపైన రూం+ భో ఫ్రీ. Q: 5th ఆపైన. 7097123055, 7097422984.

H గంగారాంలో పర్మినెంట్‌గా పనిచేయుటకు హెల్పర్స్ (M/F) (లోకల్/నాన్‌లోకల్) కావలెను. ఆసక్తిగల అభ్యర్థులు వెంటనే తమ (ID ప్రూఫ్, ఫొటోతో సంప్రదించండి. బి.రాకేష్ - 7702931309, H. గంగారాం క్లాత్ మర్చంట్, R.P. రోడ్, NZB.

Cignattk Health Insuranceలో పనిచేయుటకు, అడ్వైజర్స్, సేల్స్ మేనేజర్స్ కావలెను. అయ్యప్పగుడి దగ్గర, కంఠేశ్వర్‌రోడ్, NZB. ✆: 9948694495.

ఫైనాన్స్ కంపెనీలో పనిచేయుటకు సీనియర్, జూనియర్ అకౌంటెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, డేటా ఎంట్రీ, కలక్షన్ బాయ్స్, సూపర్‌వైజర్స్ కావలెను. జీతం: 13 వేలు - 18 వేలు. రూం + మీల్స్ ఫ్రీ. Q: 10th to any P.G. బైక్ సౌకర్యం కలదు. M/F కావలెను. 7330380732/ 7097722976.

మీ జిల్లా మండలాల్లో ఉద్యోగం కొరకు 10th, Inter, Degree (or) ITI (స్త్రీ//పు) కావలెను. జీతం: 8500 to 10 వేలు. మీ ఫోన్//పోస్టల్ అడ్రస్ SMS చేయండి. శార్వాణి గ్రూప్స్, Hnk., వరంగల్. సంప్ర॥ 8008950772.

భాగ్యలక్ష్మీ ఫిజియోథెరపి క్లినిక్, వినాయక్‌నగర్, NZBలో పని చేయుటకు డిగ్రీ (B.Sc నర్సింగ్) అమ్మాయిలు కావలెను. (లోకల్ వారికి ప్రాధాన్యత). ✆: 8639180462.

ప్రముఖ కంపెనీలో పని చేయుటకు లేడి కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. (ట్యాలీ కంప్యూటర్ నాలెడ్జ్) కలిగి ఉండాలి. మరియు సూపర్ వైజర్స్ కావలెను. ✆: 9948736456.

శ్రీలక్ష్మీ TVS 2వీలర్ షోరూం బోధన్‌లో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటీవ్, సూపర్‌వైజర్, మెకానిక్స్ కావలెను. Opp: SBI, శ్రీలక్ష్మీ మోటార్స్, బోధన్. Ph: 08467 - 222888.

బాన్సువాడలో గ్యాస్ సప్లయ్ చేయుటకు డెలివరీ బాయ్స్ కావలెను. సంప్రదించండి. ✆: 8341745474.

Akshaya Tractors Nizamabad, Kamareddy, Armoor, Banswadaలో పని చేయుటకు Sales Executives కావలెను. ✆: 9440495406.

ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు Male/ Female స్టాఫ్ కావలెను. సంప్ర॥ ఖలీల్‌వాడి, నిజామాబాద్. ✆: 8520862561.

FACULTY / TEACHERS

Wanted to teach Primary Social I to IV Classes and Physical Science for VIII to X Classes E/M Background Essential. ✆: 9618204050.

Wanted Teachers to teach Hindi and Biology (E/M) (VI to Xth Hindi), Con: Raoji Sangam High School, Namdevwada, NZB. ✆: 8341053930.

Qualified Teachers to teach English and Science for 1st - 5th Class E/M Contact: Vaasu High School, Venkateshwara Colony, Dubba, NZB. ✆: 9490815229, 9441585511.

EDUCATION

DISTANCE EDUCATION

ఇంటర్/డిగ్రీ/ PG పూర్తి చేసుకోవచ్చు +2, HEC, CEC, MPC, BiPC, UG: BA, B.Com, B.Sc, PG: MA, M.Com, M.Sc, MBA (All) సంప్ర॥ నేహ అకాడమి, కంఠేశ్వర్, NZB. ✆: 9948480490, 9396838176.

REAL ESTATE

FLAT FOR SALE

మేడ్చల్ కోర్టు రోడ్‌లో KLR నగర్ 3rd ఫేస్ నందు అన్ని సదుపాయాలతో తక్షణ గృహనిర్మాణానికై అనువైన HMDA ప్లాట్స్ కలవు. బ్యాంక్ లోన్ కలదు. స్పాట్ Reg. ✆ 9030491367

To Book Your Classified Advertisements
Please Call: ✆
9959097634
8008700961
★ GST వర్తించును.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

సమస్యలు నివేదించండి.. పరిష్కరిస్తాం..

బోధన్, న్యూస్‌టుడే: మండల స్థాయిలోని ప్రతి సమస్యను అధికారులు తమకు నివేదిస్తే ప్రభుత్వం ద్వారా నిధులు సాధించి పరిష్కరిస్తామని నిజామాబాద్ ఎంపీ కవిత తెలిపారు. బుధవారం ఎంపీపీ గంగాశంకర్ అధ్యక్షత నిర్వహించిన బోధన్ మండల పరిషత్తు సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్సీ వీజీగౌడ్, ఎమ్మెల్యే షకీల్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్షేత్ర సంగతులపై అవగాహన పెంచుకోవడానికి తాను క్రమంగా మండల సమావేశాలకు వస్తానని హామీ ఇచ్చారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు నియోజకవర్గంలో ఉన్న 950 గ్రామాలన్నింటిలో పర్యటించే అవకాశం లేకున్నా వీలైనన్ని తిరుగుతానని తెలిపారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో, సమావేశాల్లో ఆమె పాల్గొని మండల సమస్యలపై సమీక్ష నిర్వహించారు.


మాట్లాడుతున్న ఎంపీ కవిత, పక్కన ఎమ్మెల్యే షకీల్ తదితరులు

ఎంపీటీసీ సభ్యులకు రూ.5 లక్షలు

బోధన్‌లోని 19 మంది ఎంపీటీసీ సభ్యులకు రూ. 5 లక్షల చొప్పున తన నిధులు ఇస్తానని ఎంపీ కవిత తెలిపారు. నిధులు లేక ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామని ఎంపీపీ గంగాశంకర్ మండల సమావేశంలో ఆమె వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్పందించి తన నిధుల నుంచి రూ.5 లక్షలు చొప్పున మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే మండల కాంప్లెక్సు నిర్మాణానికి రూ. 15 లక్షలు ఇస్తానన్నారు.


రూ.40 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం

బోధన్ గ్రామీణం: మండలంలోని సాలూరలో ఎంపీ కవిత పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. మన ఊరు- మన ఎంపీ కార్యక్రమంలో భాగంగా రూ.40 లక్షల విలువ చేసే పనులు ప్రారంభించారు. ముందుగా గ్రామ శివారులో చాకలి ఐలమ్మ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. తరువాత రూ.10 లక్షల ఉపాధి నిధులతో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డును, రూ.5 లక్షలతో నిర్మించిన బస్‌షెల్టర్, మహిళా మండలి భవనాన్ని ఎమ్మెల్యే షకీల్, ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. సాలూరలో పర్యటనకు వచ్చిన ఎంపీ కవితకు ఘనస్వాగతం లభించింది. మహిళలు మంగళహారతులు పట్టి గ్రామంలోకి ఆహ్వానించారు. ముందుగా శివాలయం, హనుమాన్ మందిరాల్లో పూజలు నిర్వహించిన అనంతరం అన్ని వీధుల గుండా పాదయాత్రగా సందర్శిస్తూ స్థానిక సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. మూడు గంటల పాటు సాగిన పాదయాత్రలో స్థానికులు, పార్టీ కార్యకర్తలు ఆమె వెంట నడిచారు. మార్గమధ్యలో బోయి కులస్థులు ఎంపీకి చేపలు, కుర్మ యాదవులు గొర్రె పిల్లలు అందజేశారు. కుమ్మరులు మట్టికుండ తయారు చేసి ఎంపీకి బహూకరించారు.

తెరాస పాలనలోనే పేదలకు న్యాయం: ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: గతంలో ఏ ప్రభుత్వం చేయలేని పనులు తెరాస పాలనలో చేసి చూపిస్తున్నామని, పేదలకు తెరాస పాలనలోనే న్యాయం జరుగుతోందని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 40వ డివిజన్ దుబ్బ ప్రాంతంలో 'మీ ఎమ్మెల్యే.. మీ ఇంటికి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివాహ నిమిత్తం దరఖాస్తు చేసుకున్న కుటుంబానికి కల్యాణలక్ష్మి కింద రూ.51 వేల చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివాహ ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఏమాత్రం జాప్యం చేయకుండా చెక్కులను అందజేస్తున్నామని తెలిపారు.

తాజాగా మరో అడుగు ముందుకు వేసి దరఖాస్తు చేసుకున్న కుటుంబానికి కల్యాణలక్ష్మి చెక్కులను నేరుగా ఇంటికే వెళ్లి అందజేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఏ పథకం ప్రారంభించినా చెప్పులరిగిపోయేలా కార్యాలయాల చుట్టు తిరిగినా పని అయ్యేది కాదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు చేసిన లోపాలను సరిద్దిదేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ సుజాత, కార్పొరేటర్ పంచరెడ్డి సురేష్, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, మేయర్ సుజాత